

# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

GST No.37ACDFM5465G1Z1

RNI-APTEL/2012/46499

No: KNL/3`78(D)/2026`2028

Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ | సంపుటి -14 | సంచిక - 197 | పేజీలు - 08 | వెల - 05/-

మంగళవారం 14-07-2026


మంత్రి నారా లోకేష్ పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ





## పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్

● ముంబైలో పవన్ కుడి భుజానికి శస్త్రచికిత్స ● మూడు వారాల పాటు ఫిజియోథెరపీ అవసరమన్న వైద్యులు ● ఆదివారం పవన్‌ను పరామర్శించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ పరామర్శించారు. భుజానికి శస్త్రచికిత్స చేయించుకుని ముంబైలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పవన్‌ను ఫడ్నవీస్ సోమవారం కలిసి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పవన్ కల్యాణ్ త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. పవన్ కల్యాణ్ కుడి భుజానికి శనివారం సుమారు మూడున్నర గంటల పాటు వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు. 2016లో ఆయన భుజానికి గాయమవగా, మిగతాది 2లో



# గోదావరి డెల్టాకు శాశ్వత భద్రత

-2 ఏళ్లల్లో ఇరిగేషన్ రంగానికి రూ.24 వేలకోట్లు ఖర్చు

- ప్రకటించిన క్యాలెండర్ కు అనుగుణంగా ఇరిగేషన్ ప్రాజెక్టులు
- డబ్బులిచ్చి మరీ గొడ్డలి పార్టీ అరాచకాలు సృష్టిస్తోంది
- పవన్ ను అవమానిస్తున్నారు... వాళ్ల కుటుంబ సభ్యులను కించపరుస్తున్నారు
- పిచ్చుకలంకలో రైతుల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మిగతా 2లో

కొత్తపేట/ఆత్రేయపురం, జులై 13:- గోదావరి డెల్టాకు శాశ్వత రక్షణ కల్పించే చర్యలను కూటమి ప్రభుత్వం చేపట్టిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. దీంట్లో భాగంగానే సర్ అర్థర్ కాటన్ బ్యారేజ్ కు కొత్త గేట్లను అమరుస్తున్నట్టు చెప్పారు. ధవళేశ్వరం బ్యారేజీకి రూ.152.95 కోట్ల వ్యయంతో 117 కొత్త గేట్లను అమర్చే పనులను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. *ఈ మేరకు ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించిన ముఖ్యమంత్రి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. వచ్చే ఏడాది జూన్ నెలకు కొత్తగేట్ల బిగింపు ప్రక్రియను పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. గోదావరి పుష్కరాలకు గేట్లను అమర్చే పనులను పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.* ధవళేశ్వరం బ్యారేజీ నుంచి ప్రస్తుతం సముద్రంలోకి ఎంత నీరు వెళ్తోందని సీఎం చంద్రబాబు ఆరా తీశారు. ప్రస్తుతం 27 వేల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి వెళ్తోందని అధికారులు వివరించారు.



## బంకిపూర్ లో నాదే గెలుపు... నామినేషన్ వేసిన ప్రశాంత్ కిశోర్

● బంకిపూర్ అసెంబ్లీ ఉపఎన్నిక బరిలో ప్రశాంత్ కిశోర్ ● తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల బరిలో జన సురాజ్ పార్టీ అధినేత ● ప్రజలు కొత్త రాజకీయ ప్రత్యామ్నాయం కోరుకుంటున్నారని వ్యాఖ్య ● బీజేపీ, ఆర్జేడీలతో త్రిముఖ పోటీ నెలకొన్న ఉపఎన్నిక ● అభివృద్ధి, పారదర్శక పాలనే తమ ఎజెండా అని స్పష్టీకరణ

బీహార్ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ప్రముఖ రాజకీయ వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు




## ఇక హర్మూజ్ జలసంధిని మేమే నడిపిస్తాం.. కానీ మాకు డబ్బులివ్వాలి

- హర్మూజ్ జలసంధిని స్వాధీనం చేసుకుంటున్నామన్న ట్రంప్
- ఒప్పందాన్ని ఉల్లంఘించి ఇరాన్ డ్రోన్లు పంపుతోందని ఆరోపణ
- ఇరాన్‌పై రాత్రి సైనిక దాడులు చేశామని వెల్లడి
- జలసంధి భద్రతకు ఇతర దేశాలు డబ్బు చెల్లించాలని డిమాండ్



అంతర్జాతీయ రాజకీయాల్లో తీవ్ర పరిణామాలకు దారితీసే విధంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. కీలకమైన హర్మూజ్ జలసంధిని అమెరికా తన నియంత్రణలోకి తీసుకుంటుందని, ఇకపై దాని భద్రతను శాశ్వతంగా పర్యవేక్షిస్తుందని సోమవారం స్పష్టం చేశారు. ఇరాన్ ఒక సైనిక ఒప్పందాన్ని ఉల్లంఘించి, ఈ వ్యూహాత్మక జలమార్గంలోకి డ్రోన్లను పంపడమే ఇందుకు కారణమని ఆయన ఆరోపించారు. మిగతాది 2లో

## గోవధ కేసు.. సీఎం విజయ్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఊరట!

● ఏ రోజూ రాష్ట్రంలో ఆవులను వధించకుండా చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశం ● ఉత్తర్వులను సుప్రీంకోర్టులో సవాల్ చేసిన రాష్ట్ర ప్రభుత్వం ● పదేళ్లు దాటిన లేదా సంతానోత్పత్తికి పనికిరాని జంతువుల వధకు అనుమతి ఉందని వాదన ● హైకోర్టు ఉత్తర్వులకు సవరణ అవసరమన్న సుప్రీంకోర్టు




# పార్లమెంటులో తెలంగాణ గళం వినిపించండి

- పార్టీలకు అతీతంగా పార్లమెంటులో ?తెలంగాణ వాణి వినిపించండి
- అవసరమైన సమాచారం ఇస్తాం : ఎంపీల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి
- హాజరైన బీజేపీ ఎంపీలు ఈటల, కొండా కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డిపై



హైదరాబాద్ :- తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా పార్లమెంటులో గళాన్ని వినిపించాలని సీఎం ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. దానికోసం రాజకీయాలకు అతీతంగా పనిచేసేందుకు సిద్ధంగా ఉండాలని చెప్పారు. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో సోమవారంనాడాయన హైదరాబాద్ ప్రజాభవన్‌లో ఎంపీలతో భేటీ అయ్యారు. దీనికి కాంగ్రెస్ ఎంపీలతోపాటు బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వరరెడ్డి కూడా హాజరయ్యారు. అధికారపార్టీ నిర్వహించే ఎంపీల సమావేశంలో ప్రతిపక్ష? ఎంపీలు కూడా పాల్గొనడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా పార్లమెంటులో రాష్ట్ర ప్రయోజనాల కోసం అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఏర్పాటు చేశారు. పార్టీలకు అతీతంగా ప్రభుత్వం వద్ద ఉన్న సమాచారాన్ని ఎంపీలందరికీ అందచేస్తామని సీఎం చెప్పారు. నీటి పారుదల ప్రాజెక్టులు, మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించి కేంద్రం నుంచి అవసరమైన అనుమతుల సాధనపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటుకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి మంజూరు కోసం విజ్ఞప్తి చేయాలని చెప్పారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్-× స్వాధీనం, ఫేజ్-×× విస్తరణకు సంబంధించి ఎస్బీఐక్యాబ్స్‌ను కన్సల్టెంట్‌గా నియమించేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందనీ, ఆ ప్రక్రియ త్వరగా ముందుకు సాగేలా చూడాలని సూచించారు. దీనికి బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంలో పనుల ప్రారంభానికీ, దక్షిణ భాగం భూ సేకరణకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం కోసం యత్నించాలని సూచించారు. మూసీ పునరుజ్జీవం పనులను అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద తీసుకునే విషయంలో కేంద్ర అనుమతి కోసం ఆ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేయాలన్నారు. తుంగభద్ర ప్రాజెక్టు నుంచి తెలంగాణకు మిగతాది 2లో

## మత్స్యకారుల మరణాలపై జగన్ శవ రాజకీయాలు చేస్తున్నారు...




ఐదేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలను దారుణంగా మోసం చేసి, నట్టేట ముంచి, ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని పరామర్శల పేరుతో దొంగ నాటకాలు ఆడుతున్నారని వైసీపీ అధినేత జగన్ పై రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం నాడు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మత్స్యకారుల కడుపు కొట్టి, వారి నోటికాడి కూడు లాక్కున్న జగన్ రెడ్డి.. ఇప్పుడు పెద్ద యోగ్యుడిలా పరామర్శల డ్రామాలు ఆడటం సిగ్గుచేటని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.విశాఖపట్నం సముద్ర తీరంలో ఇటీవల జరిగిన పడవ ప్రమాదంపై ప్రభుత్వం తక్షణం స్పందించిందని కొల్లు రవీంద్ర తెలిపారు. మిగతాది 2లో

## 'సింగరేణి భరోసా యాత్ర' ప్రారంభించిన తెలంగాణ బీజేపీ

● తాడిచెర్ల-2 బొగ్గు బ్లాక్ కేటాయించిన నిర్ణయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యం ● హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి ప్రారంభం ● కిషన్ రెడ్డి, రాంచందర్ రావు సహ పలువురు నేతలతో 2 రోజుల యాత్రకు శ్రీకారం ● బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ సింగరేణిని నిర్లక్ష్యం చేశాయని ఆరోపణ



సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్)కు కేంద్ర ప్రభుత్వం తాడిచెర్ల-2 బొగ్గు బ్లాక్ కేటాయించిన నిర్ణయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తెలంగాణ బీజేపీ సోమవారం 'సింగరేణి భరోసా యాత్ర'ను ప్రారంభించింది. హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తదితర నేతలు ఈ రెండు రోజుల యాత్రకు శ్రీకారం చుట్టారు. మిగతాది 2లో

# గోదావరి డెల్టాకు శాశ్వత భద్రత

వచ్చే ఏడాది జూన్ నెలకు కొత్తగేట్ల బిగింపు ప్రక్రియను పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. గోదావరి పుష్కరాలకు గేట్లను అమర్చే పనులను పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి ప్రస్తుతం సముద్రంలోకి ఎంత నీరు వెళ్తోందని సీఎం చంద్రబాబు ఆరా తీశారు. ప్రస్తుతం 27 వేల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి వెళ్తోందని అధికారులు వివరించారు. అలాగే కాల్వలకు ఎన్ని క్యూసెక్కులు విడుదల చేశారని ముఖ్యమంత్రి అడిగారు. 14,700 క్యూసెక్కుల నీరు కాల్వలకు వదిలామని అధికారులు చెప్పారు. కాల్వ చివరి భూములకూ నీరు అందేలా నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని సీఎం ఆదేశించారు. ఈ విషయంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు బాధ్యత తీసుకోవాలని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలోని పిచ్చుకలంకలో రైతులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గోదావరి డెల్టాకు దేశానికే అన్నపూర్ణ అనే ఖ్యాతి రావడానికి సర్ ఆర్థర్ కాటన్ నిర్మించిన ఆనకట్టే కారణమని, అనంతరం ఎన్టీఆర్ హయాంలో నిర్మించిన కొత్త బ్యారేజీతో మరో పంటకు సాగునీరు అందించే అవకాశం ఏర్పడిందని చంద్రబాబు గుర్తుచేశారు. 2.9 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం, 32.2 లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకునే సామర్థ్యంతో పాటు ఈస్ట్రన్, సెంట్రల్, వెస్ట్రన్ డెల్టాల్లో కలిపి 10.13 లక్షల ఎకరాలకు సాగునీరు అందేలా బ్యారేజీ ఉపయోగపడుతోందన్నారు. అయితే 50 ఏళ్లకు పైగా గేట్లు, మోటార్లు, విద్యుత్ వ్యవస్థలు పాతబడటంతో వాటి ఆధునీకరణ అత్యవసరమైందని ముఖ్యమంత్రి చెప్పారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం రూ.32 కోట్లతో కొత్త గేట్లను అమర్చిందని, ఇప్పుడు మిగిలిన పాత గేట్ల స్థానంలో 117 కొత్త గేట్లను తొమ్మిది నెలల్లో అమర్చేలా చర్యలు ప్రారంభించామని సీఎం తెలిపారు. గత పాలకులు ఇరిగేషన్ ప్రాజెక్టులను కనీస నిర్వహణ కూడా చేపట్టలేదని విమర్శించారు. గేట్లు కొట్టుకుపోయినా పట్టించుకోలేదని... కనీసం గ్రీజ్ పెట్టేందుకు అవసరమైన నిధులను కూడా గత పాలకులు ఇవ్వలేదని ముఖ్యమంత్రి అన్నారు. తుంగభద్ర ప్రాజెక్టుకు మొత్తంగా కొత్త గేట్లను బిగించామని వివరించారు. తాము గత రెండేళ్లలోనే సాగునీటి రంగానికి రూ.24 వేల కోట్లు వెచ్చించామని ముఖ్యమంత్రి తెలిపారు.

**పోలవరం నిర్వాసితులను ఆనందంగా ఉంచుతాం**

ఒకప్పుడు కోనసీమలో వరికి మద్దతు ధర లేక రైతులు క్రాప్ హాలిడే ప్రకటించే పరిస్థితి నెలకొంటే, ఇప్పుడు రైతుల ధాన్యానికి గిట్టుబాటు ధరతో పాటు విక్రయించిన 24 గంటల్లోనే డబ్బులు వారి ఖాతాల్లో జమ చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించిందని సీఎం విమర్శించారు. 2014-19 మధ్య 72 శాతం పనులు పూర్తిచేయగా, ఆ తర్వాత ఐదేళ్లలో కేవలం 2 శాతం పనులు మాత్రమే జరిగాయని అన్నారు. టీడీపీ ప్రభుత్వం కొనసాగి ఉంటే 2021 నాటికే పోలవరం పూర్తయ్యేదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పనులు వేగవంతమై ప్రస్తుతం 89 శాతం పురోగతి సాధించామని తెలిపారు. నిర్వాసితులకు పూర్తి న్యాయం చేస్తామని, పునరావాసం, పరిహారం విషయంలో ఎలాంటి రాజీ ఉండదన్నారు. వారిని ఆనందంగా ఉంచుతామని... అనుకున్న సమయానికి పోలవరం ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ప్రకటించిన క్యాలెండర్ కు అనుగుణంగా ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులు చేపడుతోందని చెప్పారు. పోలవరం పూర్తయితే గోదావరి జిల్లాలకు నీటి సమస్య శాశ్వతంగా తీరుతుందని, పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణా డెల్టా, రాయలసీమకు తరలించి అక్కడి వ్యవసాయ రూపురేఖలనే మార్చామని ముఖ్యమంత్రి వివరించారు. మైక్రో ఇరిగేషన్ విస్తరించడంతో ఉద్యాన పంటలు అభివృద్ధి చెందాయని, పరిశ్రమలకు నీటి సరఫరా సాధ్యమై కియా వంటి భారీ పరిశ్రమలు రాయలసీమకు వచ్చాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

**కూటమిపై గోదావరి జిల్లాల ప్రజల అభిమానం తరగనిది**

గోదావరి ప్రజలు అభివృద్ధిని ఆదరించే స్వభావం కలవారని, గతంలోనూ టీడీపీకి అపూర్వ ఆదరణ ఇచ్చారని చంద్రబాబు గుర్తు చేశారు. 2024 ఎన్నికల్లో కూటమికి ఇచ్చిన భారీ విజయాన్ని రాష్ట్ర అభివృద్ధికి ఇచ్చిన ఆశీర్వాదంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల సహకారం, భగవంతుడి ఆశీస్సులతో ఆర్థిక సవాళ్లను అధిగమించి రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, పుష్కర ఘాట్ల అభివృద్ధితో పాటు రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో సుమారు రూ.1,200 కోట్లతో మౌలిక వసతులు కల్పించనున్నట్లు వెల్లడించారు. పిచ్చుకలంక, బొబ్బర్లంక ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామని, కోనసీమకు రైల్వే లైన్ తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని చెప్పారు. కోవ్వూరులో కోకో సిటీ ఏర్పాటు చేయనున్నట్లు కూడా ప్రకటించారు. ఆక్వా రైతులకు యూనిట్‌కు రూ.1.50కే విద్యుత్ అందిస్తున్నామని, మెట్ట ప్రాంతాల్లో పామాయిల్, కోకో సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తోందని చెప్పారు. వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గుతున్న నేపథ్యంలో రైతులు పంటల ఎంపికలో శాస్త్రీయ విధానాలు అనుసరించాలని సీఎం సూచించారు.

**అభివృద్ధి-సంక్షేమమే కూటమి లక్ష్యం**

రాష్ట్ర పునర్నిర్మాణమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రధాని నరేంద్ర మోదీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో కలిసి ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతున్నామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ నెలలోనే తల్లికి వందనం నిధులు జమ చేస్తామని, సామాజిక భద్రత పెన్షన్లు, రైతు సంక్షేమ కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్నప్పటికీ ప్రజల మధ్యకే రావాలనే తపనతో ఉన్నారని, ముంబై వెళ్లి ఆయనను పరామర్శించి పూర్తిగా కోలుకున్న తర్వాతే ప్రజాసేవలో పాల్గొనాలని సూచించినట్లు చెప్పారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్, రౌడీయిజంపై రాజీపడబోమని సీఎం హెచ్చరించారు. మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు, వ్యక్తిత్వ హననం, సోషల్ మీడియా దుర్వినియోగాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. గంజాయిని ప్రోత్సహించే వారిపైనా, మహిళలను కించపరిచే వారిపైనా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రౌడీలతో, బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్ లను మించి గొడ్డలి పార్టీతోనే సమస్యలు సృష్టిస్తోందని సీఎం మండిపడ్డారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కుటుంబ సభ్యులపై అసభ్యంగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని... ఆడవాళ్లని అసభ్యంగా మాట్లాడే వారిని గొడ్డలి పార్టీ సమర్థిస్తోందని విమర్శించారు. సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తూ... గొడ్డలి పార్టీ నేతలు ఫైనాన్స్ చేస్తున్నారు.. స్టూడియోలు పెట్టిస్తున్నారని విమర్శించారు. గంజాయి, బ్లేడ్ బ్యాచ్ లను గొడ్డలి పార్టీ సపోర్ట్ చేస్తోందని... వారికి డబ్బులిచ్చి ప్రొత్సహిస్తోందని ముఖ్యమంత్రి చెప్పారు. వీళ్లపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్, పొంగూరు నారాయణ, వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీష్, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# గోవధ కేసు.. సీఎం విజయ్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఊరట!

ఆవులు, దూడల వధపై మద్రాస్ హైకోర్టు జారీ చేసిన కీలక ఆదేశాలకు సుప్రీంకోర్టు సోమవారం తాత్కాలికంగా నిలిపివేసింది. బక్రీద్ సందర్భంగా మాత్రమే కాకుండా ఏ రోజూ రాష్ట్రంలో ఆవులు, దూడలను వధించకుండా చర్యలు తీసుకోవాలని హైకోర్టు తమిళనాడు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం హైకోర్టు ఆదేశాల అమలుపై స్టే విధిస్తూ ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. 1958 తమిళనాడు జంతు సంరక్షణ చట్టంలోని నిబంధనలకు విరుద్ధంగా హైకోర్టు సంపూర్ణ నిషేధం విధించిందని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. ఆ చట్టం ప్రకారం 10 ఏళ్లు దాటిన లేదా వ్యవసాయం, సంతానోత్పత్తికి పనికిరాని పశువులకు సంబంధిత అధికారుల ధ్రువీకరణతో వధకు అనుమతి ఉందని ప్రభుత్వం వాదించింది. అలాంటి చట్టపరమైన వెసులుబాట్లు ఉన్నప్పటికీ అన్ని సందర్భాల్లోనూ వధను పూర్తిగా నిషేధించడం చట్ట పరిధిని మించిపోయిన చర్య అని పేర్కొంది.వాదనలు విన్న సుప్రీంకోర్టు, మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులకు "సవరణ అవసరం ఉంది" అని వ్యాఖ్యానించింది. దీంతో హైకోర్టు ఇచ్చిన ఆదేశాల అమలును తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు నిలిపివేసింది. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రతివాదుల నుంచి సమాధానం కోరుతూ విచారణను వాయిదా వేసింది. బహిరంగ ప్రదేశాల్లో అక్రమంగా ఆవులను వధిస్తున్నారని ఆరోపిస్తూ ఇందు మక్కల్ కట్చి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్య మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు, అధికారికంగా గుర్తింపు పొందిన కబేళాల్లో మాత్రమే జంతువుల వధ జరగాలని స్పష్టం చేసింది. అలాగే రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల్లోని ఆర్టికల్-48ను ప్రస్తావిస్తూ ఆవులు, దూడల వధను నిరోధించే దిశగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయితే ఈ ఆదేశాలు చట్టాన్ని మించిపోయాయని రాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేయడంతో వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది.

# పార్లమెంటులో తెలంగాణ గళం వినిపించండి

15.09 టీఎంసీల నీరు రావాల్సి ఉన్నా, పూడికతో 5 టీఎంసీలకు మించి రావడం లేదన్నారు. పూడిక తొలగింపునకు ఏపీ, కర్ణాటకను ఒప్పించాలని సీఆర్ పాటిల్‌ను కోరామనీ, ఈ విషయంపైనా ఎంపీలు కేంద్ర మంత్రిని కలవాలని సూచించారు. గోదావరిలో ఛత్తీస్‌గఢ్‌కు ఉన్న 300 టీఎంసీల నీటిని ఆ రాష్ట్రం వాడుకోవడం లేదన్నారు. భవిష్యత్‌లో 160 టీఎంసీలు వాడుకున్నా 143 టీఎంసీలు మిగులు ఉంటాయనీ, అందులో తెలంగాణకు 43 టీఎంసీలు లభించే అవకాశం ఉందన్నారు. నదుల అనుసంధానంలో గోదావరి నుంచి నాగార్జున సాగర్‌కు నీళ్లు తీసుకునే విషయంలో ఛత్తీస్‌గఢ్‌ను ఒప్పించే బాధ్యత కేంద్ర ప్రభుత్వం తీసుకుందని తెలిపారు. ఆ రెండింటిని రాష్ట్రానికి అనుకూలంగా సాధించాలని సీఎం అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రారంభించిన ప్రాజెక్టులకు ఏపీ నుంచి నిరభ్యంతర పత్రాలు వస్తే వాటికి ఉన్న అడ్డంకులు తొలగిపోతాయని అన్నారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టుకు సంబంధించి 150 నుంచి151 అడుగుల్లో నిర్మించేందుకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌తో భేటీ అవుదామని ఎంపీలతో సీఎం అన్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి బెంగుళూరు, చెన్నై, ముంబయిలకు వెళ్లే బుల్లెట్ రైళ్లు, ఆదిలాబాద్ డిఫెన్స్ ఎయిర్‌పోర్ట్, వరంగల్ ఎయిర్‌పోర్ట్‌లకు అవసరమైన భూ సేకరణ పూర్తి చేశామన్నారు. ఎంపీలు వాటిపై దృష్టి పెట్టాలని కోరారు. పార్టీలకతీతంగా ఎంపీలకు అవసరమైన సమాచారం అందిస్తూ, సమన్వయం చేసుకోవడానికి

ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఐఏఎస్ అధికారి అద్వైత్ కుమార్ సింగ్‌ను నియమించామని తెలిపారు. పెండింగ్ అంశాలకు సంబంధించి ఏ సమాచారం కావాలన్నా ఆయన దగ్గర నుంచి తీసుకోవాలని సూచించారు. అన్ని పార్టీల ఎంపీలను సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని మల్లు రవికి సీఎం సూచించారు. రాష్ట్రంలో పండే ధాన్యానికి తగిన మిల్లింగ్ సామర్థ్యం లేదనీ, స్టోరేజీ సమస్య ఉందని ఈటల రాజేందర్ అన్నారు. ప్రొటోకాల్ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గద్వాల దగ్గర మూతపడిన ఆయిల్ మిల్లు పునరుద్ధరణపై మల్లు రవి అధికా రులను ప్రశ్నించారు. ఏడెనిమిది నెలల్లో పునరుద్ధరణ పూర్తవుతుందని అధికారులు తెలిపారు. పార్లమెంట్‌లో ప్రశ్నలు వేయడానికి వీలుగా ఈ సమావేశాలు చాలా ముందుగా ఏర్పాటుచేయాలని చామల కిరణ్ కుమార్ రెడ్డి కోరారు. ఎంపీలంతా ఏదో ఒక స్టాండింగ్ కమిటీ, కన్సల్టేన్సీ కమిటీల్లో సభ్యులుగా ఉంటారనీ, ఆ సమాచారం తీసుకుని ఆయా అంశాలకు సంబం ధించిన పెండింగ్ విషయాలు తెలియజేస్తే పార్లమెంట్ సమావేశాల్లో తాము చర్చించేందుకు వీలుంటుందని రామసహాయం రఘురామిరెడ్డి అన్నారు.

**ప్రాజెక్టులపై నిపుణుల కమిటీ వేయండి-బీజేపీ ఎంపీలు**

కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి డిజైన్లలోనే లోపాలున్నాయని బీజేపీ ఎంపీలు కొండా విశ్వేశ్వరరెడ్డి, ఈటల రాజేందర్ అన్నారు. దీనిపై నిపుణులతో కమిటీ వేసి అధ్యయనం చేయించాలని కోరారు. దీనికి సీఎం ఏ రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. కాళేశ్వరంపై సీబీఐ విచారణ అంశాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీలు కడియం కావ్య, రామసహాయం రఘురామిరెడ్డి, చామల కిరణ్ కిమార్ రెడ్డి, రఘువీర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బంకిపూర్ లో నాదే గెలుపు...
# నామినేషన్ వేసిన ప్రశాంత్ కిశోర్



జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ (పీకే) తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి దిగుతుండడం తెలిసిందే. బంకిపూర్ అసెంబ్లీ స్థానానికి జరగనున్న ఉపఎన్నికల్లో ఆయన పోటీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయన సోమవారం నాడు పాట్నా కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు చేశారు. పార్టీ సీనియర్ నాయకులు, మద్దతుదారులతో కలిసి వచ్చి ఆయన తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ కిశోర్ మీడియాతో మాట్లాడుతూ, ఉపఎన్నిక ఫలితంపై ధీమా వ్యక్తం చేశారు. తమ ప్రచారానికి ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వస్తోందని, ఓటర్లు కొత్త రాజకీయ ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. సంప్రదాయ రాజకీయాలకు విసిగిపోయిన ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, అందువల్ల ఈ పోటీ తమకు ఏమాత్రం కష్టం కాదని తెలిపారు. ఈ ఎన్నికల తీర్పు రాష్ట్రంలో రాజకీయ మార్పుకు నాంది పలుకుతుందని, జన్ సురాజ్ విజన్ పట్ల పెరుగుతున్న మద్దతుకు ఇది నిదర్శనంగా నిలుస్తుందని ప్రశాంత్ కిశోర్ విశ్వాసం వ్యక్తం చేశారు. బంకిపూర్ ప్రజలు కుల సమీకరణాలు, పాత రాజకీయాలకు బదులుగా అభివృద్ధి, సుపరిపాలన ఆధారిత రాజకీయాలను కోరుకుంటున్నారని పీకే పేర్కొన్నారు. నాణ్యమైన విద్య, ఉపాధి అవకాశాలు, మెరుగైన మౌలిక సదుపాయాలు, పారదర్శక పాలనే తమ పార్టీ ప్రధాన ఎజెండా అని స్పష్టం చేశారు. బీహార్‌లో అత్యంత ఆసక్తికరంగా మారిన ఈ ఉపఎన్నికలో బీజేపీ, ఆర్జేడీ వంటి ప్రధాన పార్టీలు కూడా తమ అభ్యర్థులను నిలబెట్టాయి. దీంతో ఇక్కడ త్రిముఖ పోరు నెలకొంది.

## ఇక హర్మూజ్ జలసంధిని మేమే నడిపిస్తాం..
# కానీ మాకు డబ్బులివ్వాలి: ట్రంప్

ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ, "మేం హర్మూజ్ జలసంధిని స్వాధీనం చేసుకుంటున్నాం. ఇక వాళ్ల దగ్గర ఏమీ లేదు" అని వ్యాఖ్యానించారు. ఇరాన్‌కు చెందిన సైనిక ఆస్తులే లక్ష్యంగా నిన్న రాత్రి అమెరికా దాడులు చేసిందని, డ్రోన్ల కార్యకలాపాలు కొనసాగితే ఇలాంటి దాడులు మరిన్ని ఉంటాయని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. "నిన్న రాత్రి వారిపై తీవ్రంగా దాడులు చేశాం. వాళ్లు డ్రోన్ పంపిన ప్రతిసారీ మేం గట్టిగా బదులిస్తాం. వారి యాంటీ-ఎయిర్‌క్రాఫ్ట్ గన్‌తో సహా చాలా పరికరాలు ధ్వంసమయ్యాయి" అని ట్రంప్ తెలిపారు. ఇరాన్‌తో సుదీర్ఘ చర్చల అనంతరం ఒక ఒప్పందం కుదిరిందని, అయితే చివరి నిమిషంలో ఇరాన్ ప్రతినిధులు మార్పులు కోరడంతో అది విఫలమైందని ట్రంప్ వెల్లడించారు. "మా మధ్య ఒక డీల్ కుదిరింది. 11 గంటల సమావేశం తర్వాత వాళ్లు అన్నింటికీ ఒప్పుకున్నారు. కానీ తర్వాత ఫోన్ చేసి మార్పులు కోరారు. అందుకే మేం ఆ ఒప్పందాన్ని పక్కనపెట్టాం" అని వివరించారు. ఇకపై హర్మూజ్ జలసంధి భద్రత బాధ్యతను అమెరికానే తీసుకుంటుందని, అవసరమైతే తామే దాన్ని నడిపిస్తామని ట్రంప్ పేర్కొన్నారు. "ఈ జలసంధికి మేం సంరక్షకులుగా మారతాం" అని ఆయన వ్యాఖ్యానించారు. అయితే, ఈ భద్రతను ఉచితంగా అందించబోమని, ఈ మార్గం ద్వారా లబ్ధి పొందుతున్న సంపన్న దేశాలు అమెరికాకు అందుకు అయ్యే ఖర్చును చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. "మా సైనికులను ప్రమాదంలోకి నెట్టి భద్రత కల్పిస్తున్నందుకు మాకు డబ్బు చెల్లించాలి" అని ట్రంప్ స్పష్టం చేశారు.

పర్షియన్ గల్ఫ్‌ను అరేబియా సముద్రంతో కలిపే హర్మూజ్ జలసంధి, ప్రపంచ ఇంధన రవాణాలో అత్యంత కీలకమైనది. గల్ఫ్ దేశాల నుంచి భారత్ సహా ఇతర ఆసియా దేశాలకు చమురు, గ్యాస్ ఎగుమతులు ఈ మార్గం గుండానే జరుగుతాయి.

## 'సింగరేణి భరోసా యాత్ర' ప్రారంభించిన తెలంగాణ బీజేపీ

అనంతరం ఖమ్మం జిల్లాకు చేరుకున్న వారికి పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఈ యాత్రలో భాగంగా నాలుగు జిల్లాల్లోని సింగరేణి గనుల కార్మికులను కలిసి, సంస్థ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలను వివరించనున్నట్లు బీజేపీ నేతలు తెలిపారు. తాడిచెర్ల-2 బొగ్గు బ్లాక్ కేటాయింపు వల్ల సింగరేణి దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధికి బలం చేకూరుతుందని, దీంతో కార్మికుల్లో విశ్వాసం పెరిగిందని రాంచందర్ రావు పేర్కొన్నారు. యాత్ర ప్రారంభానికి ముందు మాట్లాడిన రాంచందర్ రావు, గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండూ సింగరేణిని నిర్లక్ష్యం చేశాయని ఆరోపించారు. ఈ కారణంగానే ప్రభుత్వ రంగ సంస్థ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోందని అన్నారు. మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం మాత్రం సింగరేణిని బలోపేతం చేయడానికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ తాడిచెర్ల-2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించడం చరిత్రాత్మక నిర్ణయమని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం బొగ్గు బ్లాకులు వేలం ద్వారా కేటాయించాల్సి ఉన్నప్పటికీ, చట్టపరమైన అవకాశాలను పరిశీలించి, న్యాయ సలహా తీసుకున్న అనంతరం మోదీ ప్రత్యేకంగా ఈ బ్లాక్‌ను సింగరేణికి కేటాయించే నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ట్రేడ్ యూనియన్ల విజ్ఞప్తి మేరకు తాను ప్రధానితో చర్చించి ఈ కేటాయింపును సాధించామని చెప్పారు.

## మత్స్యకారుల మరణాలపై జగన్ శవ రాజకీయాలు చేస్తున్నారు.

ప్రమాద సమాచారం అందిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో నేవీ, కోస్ట్ గార్డ్



బృందాలను రంగంలోకి దించి గాలింపు చర్యలు చేపట్టామన్నారు. ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన మత్స్యకారుడు చిన్నా అందించిన సమాచారంతో 72 గంటల పాటు గాలించినా మిగతా ఆరుగురి ఆచూకీ లభించలేదన్నారు. కోస్ట్ గార్డ్, త్రీ-మెన్ కమిటీ నివేదికల ఆధారంగా వారు మరణించినట్లు నిర్ధారించి, కేవలం 72 గంటల వ్యవధిలోనే బాధిత కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెక్కులను అందించామని వివరించారు. భారతదేశ చరిత్రలోనే ఇంత వేగంగా సాయం అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ఇలాంటి దురదృష్టకర ఘటనను కూడా జగన్ రాజకీయం చేస్తున్నారని కొల్లు రవీంద్ర మండిపడ్డారు. "ప్రభుత్వం బాధితులకు కొండంత ధైర్యాన్నిస్తే.. మీరు శవ రాజకీయాలు చేయడానికి వెళుతున్నారా?" అని ప్రశ్నించారు. గతంలో వైజాగ్ హార్బర్‌లో 45 బోట్లు కాలి బూడిదైతే కనీసం పలకరించని జగన్, ఇప్పుడు డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. తన ఐదేళ్ల పాలనలో 63 మంది మత్స్యకారులు సముద్రంలో గల్లంతై చనిపోతే, వారి కుటుంబాలకు డెత్ సర్టిఫికెట్లు కూడా ఇప్పించలేని దౌర్భాగ్యపు ముఖ్యమంత్రి జగన్ అని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ 63 కుటుంబాలకు రూ. 3.15 కోట్ల సాయం అందించి ఆదుకుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మత్స్యకారులకు అండగా నిలుస్తోందని రవీంద్ర వివరించారు. వేట నిషేధ భృతిని ఏకంగా రూ. 20,000కి పెంచి, రూ. 258 కోట్లకు పైగా నిధులను వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. మత్స్యకారుల చెరువుల హక్కులను కాలరాసేందుకు జగన్ తెచ్చిన దుర్మార్గపు జీవో నెం. 217ను రద్దు చేశామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు రాష్ట్ర వాటా ఇవ్వకుండా నిర్వీర్యం చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందని ఎద్దేవా చేశారు. గతంలో హుద్‌హుద్ తుపాను సమయంలో చంద్రబాబు దెబ్బతిన్న బోట్లకు రూ. 6 లక్షల చొప్పున సాయం అందించారని, వేలమంది ఆక్వా రైతులను ఆదుకున్నారని గుర్తుచేశారు. మత్స్యకారుల రక్షణ కోసం 4,560 శాటిలైట్ ట్రాన్స్‌పాండర్లను ఉచితంగా అందించామని, 9 ఫిషింగ్ హార్బర్ల నిర్మాణాన్ని వేగవంతం చేశామని తెలిపారు. జువ్వలదిన్నె వంటి చోట్ల కులాల మధ్య చిచ్చులు పెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఐదేళ్ల పాలనలో మత్స్యకారులకు ఏం చేశారో దమ్ముంటే చర్చకు రావాలని జగన్‌కు సవాల్ విసిరారు. మత్స్యకారులకు ఏ మేలు జరిగినా అది తెలుగుదేశం, కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమైందని కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు.

# పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్

ఇటీవలి రాజకీయ పర్యటనల్లో అభిమానులు, కార్యకర్తల తాకిడి కారణంగా ఆ గాయం తీవ్రతరమైంది. దీంతో వైద్యులు శస్త్రచికిత్స చేయాలని సూచించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, వేగంగా కోలుకుంటున్నారని వైద్య బృందం వెల్లడించింది. ఆదివారం నాడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు పలువురు మంత్రులు, ఎంపీలు ఆసుపత్రికి వెళ్లి పవన్‌ను పరామర్శించారు. ఆయనను విశ్రాంతి తీసుకోవాలని కోరుతూ, త్వరగా కోలుకుని ప్రజాసేవలో పాల్గొనాలని ఆకాంక్షించారు. వైద్యుల సూచనల మేరకు పవన్ మూడు వారాల పాటు ఫిజియోథెరపీ తీసుకోవాల్సి ఉంటుంది. ఆరు నెలల తర్వాత ఆయన ఎడమ భుజానికి కూడా వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఫడ్నవీస్ పరామర్శ రాజకీయాలకు అతీతంగా నాయకుల మధ్య ఉన్న సౌభ్రాతృత్వానికి నిదర్శనంగా నిలిచింది. తనను పరామర్శించినందుకు ఫడ్నవీస్‌కు పవన్ కృతజ్ఞతలు తెలిపారు.

## ఆడపిల్లలను చదివిస్తే మంచి భవిష్యత్తు:ఐసిడిఎస్ సూపర్వైజర్



మహానంది, పల్లె వెలుగు ఆడపిల్లలను చదివిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని వాళ్ళ కాళ్ళ మీద వాళ్లే నిలబడగలుగుతారని ఐసిడిఎస్ సూపర్వైజర్ తోట కవిత పేర్కొన్నారు. సోమవారం మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'బేటి బచావో--బేటి పడావో' కార్యక్రమం నిర్వహించారు.ఐసిడిఎస్ సూపర్వైజర్ కవిత మాట్లాడుతూ...బాలికల విద్య సమాజ అభివృద్ధికి పునాది అని తెలిపారు. 19 ఏళ్లు దాటిన తర్వాతే వివాహాలు చేయాలని, అలా చేస్తే బాలింతల ఆరోగ్య సమస్యలు తగ్గుతాయని సూచించారు. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరం అన్నారు. ఆడపిల్లలకు తెలియని వయసులో వివాహాలు చేస్తే అనారోగ్యంతో పాటు, పిల్లలకు కూడా అనేక అనారోగ్య సమస్యలు వస్తాయి అన్నారు. బాలికలు సమాజానికి మణిహారమని, బాలికలను రక్షణ కల్పిద్దాం, బంగారు భవితకు పునాది వేద్దాం అన్నారు. అనంతరం కిషోర బాలికల సంక్షేమ అభివృద్ధి, అక్షరాస్యత, ఆరోగ్య జాగ్రత్తలు వేధింపుల నియంత్రణ, సైబర్ నేరాలు, శక్తి యాప్ పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ రెడ్డి, నంద్యాల శక్తి టీం సభ్యులు ప్రసాద్, వెంకటేశ్వర్లు, రఫీ,ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## గాజులపల్లెలో 'మీ ఇంటికి- మీ డాక్టర్

మహానంది, పల్లె వెలుగు మహానంది మండలం గాజులపల్లె గ్రామంలో సోమవారం మీ ఇంటికి మీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి అధ్యక్షతన,నంద్యాల రెడ్ క్రాస్ చైర్మన్ హోదాలో ఈ కార్యక్రమం కొనసాగుతూ ఉంది. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ కమలాకర్,సిబ్బంది పాల్గొని ప్రజలకు వైద్య సేవలు అందించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రెడ్‌క్రాస్ సొసైటీ 'మీ ఇంటికి- మీ డాక్టర్' కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు. గర్భిణీ స్త్రీలకు రక్త పరీక్షలు,రక్త పోటు, షుగర్, పలు రకాల వ్యాధులకు గురైన వారిని గుర్తించి, వారికి కూడా మీ ఇంటికి మీ డాక్టర్ కార్యక్రమంలో ఉచితంగా చికిత్సలు, చేసి మందులు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు కమలాకర్ నాయుడు, మద్దిలేటి స్వామి, శేఖర్, వినయ్ కుమార్, సురేష్,నరసింహుడు, లాల్ మదర్ తదితరులు పాల్గొన్నారు.



## మరకత మహా శివలింగానికి పంచామృతాభిషేకం



దొర్నిపాడు జూలై 13 పల్లె వెలుగు న్యూస్ 100 సంవత్సరాలకు ఒకసారి వచ్చే అత్యంత అరుదైన మహా శైవాక్షయోగం ఏర్పడుతున్న రోజునభక్తిశ్రద్ధలతోదొర్నిపాడు,రామచంద్రాపురం గ్రామాలలో ప్రతిష్టించినకాశీవిశ్వేశ్వర,మరకత మహా శివలింగానికి సోమవారం పురోహితులు భార్గవ శర్మ శశికాంత్ శర్మ, రవిశంకర్ శర్మ ఉప్రజలు, భక్తుల సమక్షంలో కాశీ విశ్వేశ్వర మరకత లింగానికి పంచామృతాభిషేకాలను నిర్వహించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరుద్ర నక్షత్రం మహాశివుని జన్మ నక్షత్రం ఈరోజునశివారాధన,అభిషేకాదులకుపవిత్రమైన రోజు సోమవారం అన్నారు, ఆరుద్ర నక్షత్రం మహాదేవుడు పరమశివుని యొక్క జన్మ నక్షత్రం, సోమవారం శివారాధనకువిశిష్టత కలిగిన పవిత్రమైన రోజు, ఇలాంటి రోజున ఆరుద్ర నక్షత్రంరావడంచాల అరదుఅన్నారు,వందసంవత్సరాల క్రితంఈరోజు ఒక అద్భుతం జరిగిందని వేద పండితులు చెప్పినట్లు ఆయన చెప్పారు, ఈరోజు శివారాధన అభిషేకాదులు చేస్తే శివుని కృపకు పాత్రులు అయి పాప నివారణ పొందుతారని అన్నారుశివాలయంలోశివనామస్మరణచేస్తూ బిల్వదలంతో శివ పూజలు, శివలింగానికి అభిషేకం చేసి శివానుగ్రహం పొందాలని ఆయన ప్రజలను భక్తులను కోరారు

## అంగన్వాడి కేంద్రంలో చిన్నారికి తీవ్ర గాయాలు.




రుద్రవరం. పల్లె వెలుగు : మండలంలోని పెద్ద కంబలూరు 2వ అంగనవాడి కేంద్రంలో పల్లవి అనే చిన్నారికి తలపై రాయిపడి తీవ్ర గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. సోమవారం గ్రామస్తుల వివరాల మేరకు పల్లవి తల్లిదండ్రులు తమ కూతురిని అంగన్వాడి కేంద్రంలో వదిలి పొలం పనులకు వెళ్లారన్నారు. అంగన్వాడి కేంద్రం దగ్గర మిద్దె పైనుంచి రాయి పడడంతో చిన్నారి పల్లవికి తలపై తీవ్ర గాయాలు అయ్యాయన్నారు. గ్రామస్తులు సమాచారాన్ని 108 కి చేరవేయడంతో వెంటనే రుద్రవరం 108 వాహనం సిబ్బంది అక్కడికి చేరుకొని చిన్నారికి ప్రధమ చికిత్స చేసి వాహనంలో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు అన్నారు.

### కర్నూలులో వైభవంగా 'వరుణ యాగం'..

# భక్తిశ్రద్ధలతో 'నందికోళ్ల సేవ'

**● రైతాంగం సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజలు ● ఎరువులు, విత్తనాల వర్తక సంఘాల ఆధ్వర్యంలో హోమం ● వడ్డెమాను వీరభద్ర సేవాసమితి ఆధ్వర్యంలో ప్రత్యేక సేవలు**



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, విత్తిన ప్రతి గింజ మొలకెత్తి, రైతాంగం పచ్చని పంటలతో సుభిక్షంగా ఉండాలని కాంక్షిస్తూ కర్నూలు నగరంలో సోమవారం 'వరుణ యాగం' అత్యంత వైభవంగా ప్రారంభమైంది. కర్నూలు పెస్టిసైడ్స్, ఫెర్టిలైజర్స్, సీడ్స్ డీలర్స్, డిస్ట్రిబ్యూటర్స్ మరియు ఎంప్లాయిస్ యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో లోకకల్యాణార్థం ఈ మహత్తర ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని తలపెట్టారు. ఇదే సందర్భంలో వడ్డెమాను వీరభద్ర సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన 'నంది కోళ్ల సేవ' భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

వేద మంత్రాల సాక్షిగా.. హోమగుండంలో ఆహుతులు నగరంలోని సంకల్ బాగ్ ఏరియాలో వేంచేసియున్న ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం శ్రీ వేంకటేశ్వర స్వామి సన్నిధి (హరిహర క్షేత్రం) లో ఈ యాగాన్ని శాస్త్రోక్తంగా ఏర్పాటు చేశారు.



సోమవారం వేకువజామున 6:00 గంటలకే వేద పండితుల ఘనపాఠాల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ యాగశాల ప్రవేశం చేశారు. శాస్త్రోక్తంగా హోమ గుండంలో అగ్నిని ప్రతిష్టించి, వరుణ దేవుడిని ఆహ్వానిస్తూ ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. లోకకళ్యాణాన్ని, అలాగే జిల్లాలోని రైతాంగ శ్రేయస్సును ఆకాంక్షిస్తూ యూనియన్ ప్రతినిధులు, వ్యాపారులు ఈ పూజల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని పూర్ణాహుతి, ప్రత్యేక ఆహుతులను సమర్పించారు.

వైభవంగా 'నంది కోళ్ల సేవ'

ఈ ఆధ్యాత్మిక మహోత్సవంలో భాగంగా వడ్డెమాను వీరభద్ర సేవాసమితి ప్రతినిధులు ప్రత్యేకంగా తరలివచ్చారు. వారి ఆధ్వర్యంలో సాంప్రదాయబద్ధంగా నిర్వహించిన 'నంది కోళ్ల సేవ' కార్యక్రమం యాగశాల ప్రాంగణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్వామివారికి నందికోళ్ల సేవను సమర్పించి, వర్షాలు సమృద్ధిగా కురవాలని వారు కూడా ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

"రైతే దేశానికి వెన్నెముక.. ఆ రైతు చల్లగా ఉంటేనే సమాజం బాగుంటుంది. సకాలంలో రుతుపవనాలు అనుకూలించి వర్షాలు సమృద్ధిగా పడాలని, అన్నదాతల ఇళ్లు ధాన్యపు సిరులతో తులతూగాలని భగవంతుడిని ప్రార్థిస్తూ ఈ వరుణ యాగాన్ని, నందికోళ్ల సేవను సంకల్పించాం."

**యూనియన్ ముఖ్య ప్రతినిధులు ఉ సేవాసమితి సభ్యులు**

భక్తిశ్రద్ధలతో తరలివచ్చిన వర్తక శ్రేణులు, భక్తులు వ్యవసాయ రంగానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సేవలందిస్తున్న కర్నూలు జిల్లాకు చెందిన విత్తనాలు, ఎరువుల డీలర్లు, పంపిణీదారులు (డిస్ట్రిబ్యూటర్లు), దుకాణాల సిబ్బంది (ఎంప్లాయీస్) తో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు ఈ యాగంలో భాగస్వాములయ్యారు. వరుణ దేవుని కృపాకటాక్షాలు జిల్లాపై ఉండాలని అందరూ ఏకధాటిగా ప్రార్థించారు. భక్తుల రాకతో, వేద పండితుల జయజయధ్వానాలతో హరిహర క్షేత్ర ప్రాంగణం అంతా ఆధ్యాత్మిక శోభతో, భక్తి పారవశ్యంతో విలసిల్లింది.

## ఓ మనిషీ.. నమ్మకంతో అడుగు వేయి.. గెలిచి చూడు



పల్లె వెలుగు : ఓ మనిషీ... పని ప్రారంభించడానికి కావాల్సిన నమ్మకం కోసం ఎదురు చూస్తూ ఉండిపోకు. నమ్మకం అనేది కూర్చుంటే రాదు.. పని మొదలుపెట్టిన తర్వాతే వస్తుంది. వందసార్లు ఆలోచించడం కంటే ఒక్కసారి ప్రయత్నించి చూస్తేనే ఎక్కువ నేర్చుకుంటావు. "నేను ఇంకా పూర్తిగా సిద్ధంగా లేను" అనే సాకులు వెతకకు. సంకోచం వద్దు... సంకల్పమే ముద్దు. చిన్నచిన్న సందేహాలతో ఆగిపోకు. లక్ష్యసాధనలో దారిపొడవునా కనిపించే చీకటిని చూసి భయపడకు. ఆకాశంలోని నక్షత్రాలు రాత్రివేళనే మెరుస్తాయి. అలాగే నీవు వేసే ముందడుగే నీ జీవితానికి వెలుగునిస్తుంది. నదీ ప్రవాహం ఎప్పుడైనా ఆగిపోవడం చూశామా? కొండలు ఎదురొస్తే అది పక్కకు మళ్లుతుంది కానీ తన ప్రయాణాన్ని మాత్రం ఆపదు. నువ్వూ అంతే... అడ్డంకులకు అస్సలు లొంగకు. అవరోధాలను అవకాశాలుగా మలుచుకో. అసాధ్యాన్ని సుసాధ్యంగా నిరూపించు. మొదటి అడుగు వేయడానికి మనసు ఎంతో వెనుకాడుతుంది. "వేయగలనా... లేదా?" అనే సందేహాలను రేకెత్తిస్తుంది. కానీ ఒక్కసారి ధైర్యంగా ముందడుగు వేస్తే భయాలన్నీ క్రమంగా మాయమైపోతాయి. పసిపాప నడక నేర్చుకునే సమయంలో ఎన్నిసార్లు పడిపోతుంది? ప్రతి సారి ఏడుస్తూ అక్కడే ఉండిపోతుందా? కాదు... మళ్లీ లేచి నిలబడుతుంది. మళ్లీ అడుగులు వేస్తుంది. చివరకు పరుగులు తీస్తూ అందరినీ ఆశ్చర్యపరుస్తుంది. నీలో ఎంత శక్తి ఉందో తెలుసుకోవాలంటే గమ్యం వైపు ప్రయాణం ప్రారంభించాలి. కూర్చొని ఆలోచిస్తూ ఉంటే కాలమే కరిగిపోతుంది. అతిగా ఆలోచిస్తే ఆందోళన, కుంగుబాటు పెరిగి పనికి దూరమవుతావు. నిష్క్రమించడం కాదు... నిలబడటమే ముద్దు. అప్పుడే కలలు నిజమయ్యే మార్గం కనిపిస్తుంది. నీవు వేసే ఒక్క అడుగు చిన్నదే కావచ్చు. కానీ అదే గొప్ప విజయానికి నాంది కావచ్చు. దారి పూర్తిగా తెలియకపోయినా ధైర్యంగా ముందుకు సాగు. ఆత్మవిశ్వాసమనే నమ్మకం నీతోడు నీడలా నిన్ను నడిపిస్తుంది. ఓటమి ఎదురైతే ఒణకిపోకు. అదే గెలుపు గుర్రాన్ని ఎక్కే విద్యను నేర్పుతుంది. అనుభవం నీకు గుణపాఠమై, విజయానికి దిక్సూచిగా నిలుస్తుంది. ముందడుగు వేసి చూడు... లోకం నీ వెంట వస్తుంది. నీపై నీకు నమ్మకం రెట్టింపు అవుతుంది. ఆలోచనల తీరం దాటి ఆచరణలో అడుగుపెట్టు. నీ ప్రతి ముందడుగూ నీ నమ్మకానికి కిరీటమై, విజయానికి తొలి సంతకంగా నిలుస్తుంది. నమ్మకంతో వేసే ప్రతి అడుగు నిన్ను విజయతీరాలకు చేర్చుతుంది. నమ్మకం, ఆత్మవిశ్వాసమే అభివృద్ధికి చోదకశక్తిగా నిలిచి, మానవాళి వికాసానికి మార్గదర్శకంగా నిలుస్తాయి.

-- నేదునూరి కనకయ్య అధ్యక్షులు, తెలంగాణ ఎకనామిక్ ఫోరం మాజీ ఎన్ఎస్ఎస్ అధికారి, రచయిత, కాలమిస్ట్, కరీంనగర్

## శివాలయాల్లో భక్తుల పూజలు

బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూలై 13: మహా శైవాక్ష యోగం సందర్భంగా సోమవారం నాడు



శివాలయాల్లో భక్తులు విశేషంగా పూజలు నిర్వహించారు. బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న ఓంకార పుణ్యక్షేత్రం తో పాటు బండి ఆత్మకూరులోని శివాలయాల్లో భక్తులు పూజా కార్యక్రమాల్లో మునిగి తేలారు. మహాశైవాక్షయోగం అనేది హిందూ జ్యోతిష్య శాస్త్రంలో అత్యంత పవిత్రమైన అరుదైన ఆధ్యాత్మిక యోగం. కృష్ణపక్ష చతుర్దశి తిధి ఆరుద్ర నక్షత్రం తో పాటు సోమవారం అనే మూడు ఒకే రోజున కలిసి రావడం వల్ల ఈ అరుదైన యోగం ఏర్పడింది. ఈ యోగం దాదాపు 20 ఏళ్ల కాలచక్రంలో కేవలం 9 సార్లు సంభవించింది. ఈ ఒక్కరోజు శివారాధన చేయడం వల్ల వంద మహాశివరాత్రి పుణ్యఫలం దక్కుతుందని ఆధ్యాత్మిక పండితులు చెబుతున్నారు. పరమేశ్వరుడికి అత్యంత ప్రీతికరమైన రోజైన సోమవారం, అందునా శివయ్య జన్మ నక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం కలిసి రావడం వల్ల ఈరోజు భక్తులకు విశేష ఫలితాలను ఇస్తుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రజలు ఓంకారం పుణ్యక్షేత్రంలో విశేషమైన పూజలు నిర్వహించారు. బండి ఆత్మకూరు లోని చౌడేశ్వరి ఆలయం సమీపంలో ఉన్న శివాలయంలో మహిళలు తెల్లవారుజామున లింగాకారుడైన శివయ్యకు జలాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించి పూజా కార్యక్రమాలను చేపట్టి పునీతులయ్యారు. ఎంతో ప్రాముఖ్యత కలిగిన మహా శైవాక్షయోగం గురించి ప్రజలకు వివరించడంలో దేవాదాయ శాఖ విఫలమైంది. ఈ యోగం ప్రాముఖ్యత గురించి దేవాదాయ శాఖ ముందుగానే ప్రచారం నిర్వహించి ఉంటే భక్తులు పెద్ద ఎత్తున శివాలయాల్లో పాల్గొని పూజలు నిర్వహించే పరిస్థితులు ఏర్పడి ఉండేవి

## ఒళ్ళు కాలి అంగన్వాడి ఆయా భర్త మృతి



బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూలై 13 : బండి ఆత్మకూరు లోని మఠంపేటలో అంగన్వాడి సెంటర్ లో పనిచేస్తున్న ఆయా చౌడమ్మ భర్త కుంటుమల్ల రామసుబ్బయ్య (50) సోమవారం ఉదయం కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈనెల నాలుగవ తేదీన ఇంటి వద్ద నీటి కొళాయి కి మరమ్మతు చేస్తూ ఉన్నాడు. కొళాయి పైపులు కాల్చి వేసేందుకు దానిపై ట ర్పెంటు ఆయిల్ పోసేందుకు ఇంట్లో నుండి టర్మెంటు బాటిల్ తీసుకొని వచ్చాడు. టర్పెంట్ ఆయిల్ మూత తీసి, కొళాయి పైపును అంటించాడు. గాలికి పక్కనే ఉన్న టర్పెంట్ బాటిల్ అంటుకొని మంటలు చెలరేగి రామసుబ్బయ్య రెండు చేతులు వీపు భాగం కాలిపోయాయి. మంటలకు తాళలేక రామసుబ్బయ్య పక్కనే ఉన్న గచ్చులోకి దూకాడు. వెంటనే చికిత్స నిమిత్తము రామసుబ్బయ్యను నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ విషయంపై సమాచారం అందిన వెంటనే ఏఎస్ఐ మహబూబ్ బాషా కర్నూలు ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. రెండు నెలల క్రితమే రామసుబ్బయ్య ఓ ప్రమాదం నుండి బయటపడ్డాడు. పొలానికి వెళ్లి ఎండు గడ్డిని అంటించే ప్రయత్నంలో వడ దెబ్బ సోకి స్పృహ కోల్పోయారు. ఈ సంఘటన నుండి కోల్కున్నప్పటికీ తిరిగి ప్రమాదానికి గురయ్యాడు. ఈనెల మూడవ తేదీన కూతురు వివాహం చేశాడు. అదే రోజు సాయంత్రం ఇంటి వద్ద కులాయి పైపు మరమ్మతు చేస్తూ ప్రమాదానికి గురై ఆస్పత్రి పాలయ్యాడు. పది రోజుల నుండి కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు.

# మంత్రి నారా లోకేష్ పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

- అధికారులతో కలిసి రూట్ మ్యాప్, సభా స్థలి, పార్కింగ్ ఏరియాల తనిఖీ
- కాళికామాత ఆలయంలో ప్రత్యేక పూజలు.. చైర్‌పర్సన్ కమ్మరి పార్వతమ్మకు సత్కారం





పల్లె వెలుగు కర్నూలు బ్యూరో ఈనెల 15వ తేదీన ఆళ్లగడ్డ నియోజకవర్గంలో గౌరవ ఐటీ, విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ బాబు పర్యటించనున్న నేపథ్యంలో సోమవారం నాడు స్థానిక ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఏర్పాట్లను ముమ్మరంగా పరిశీలించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్ పర్సన్, నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కమ్మరి పార్వతమ్మతో కలిసి ఆమె సభా స్థలాన్ని, రూట్ మ్యాప్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

మంత్రి పర్యటన నిమిత్తం ట్రాఫిక్ నియంత్రణ, సభా స్థలం వద్ద పార్కింగ్ ఏరియా కేటాయింపు, భద్రతా చర్యలపై డీఎస్పీ శ్రీనివాసరావు, ఎమ్మార్వో, సీఐ, పోలీస్, రెవెన్యూ, ఫైర్ విభాగాల అధికారులతో ఎమ్మెల్యే అఖిలప్రియ సమగ్రంగా చర్చించారు. ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా సమన్వయంతో పనిచేసి పర్యటనను జయప్రదం చేయాలని అధికారులను ఆదేశించారు.

**ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని పూజలు:**

సభాస్థల పరిశీలన అనంతరం ఆళ్లగడ్డలోని ప్రముఖ కాళికామాత దేవి ఆలయాన్ని నాయకులు సందర్శించారు. మంత్రి నారా లోకేష్ బాబు పర్యటన అత్యంత విజయవంతం కావాలని, అలాగే ఇటీవల ముంబై ఆసుపత్రిలో సర్జరీ చేయించుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ గారు త్వరగా కోలుకోవాలని కాంక్షిస్తూ ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేదమంత్రాల నడుమ అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కమ్మరి పార్వతమ్మను ఆలయ మర్యాదలతో, గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాళికామాత ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు పెద్ద సుబ్బయ్య ఆచారి, తునికిపాటి కోటేశ్వరరావు, బాణాల గోపాల్ ఆచారి, ఉపాధ్యక్షులు సురేష్ బాబు, ప్రధాన కార్యదర్శి గోపాల్ ఆచారి, ప్రధాన అర్చకులు చంద్రశేఖర్ ఆచారి పాల్గొన్నారు. అలాగే సంఘం సభ్యులు చిన్న పుల్లయ్య ఆచారి, విజయ్ కుమార్ ఆచారి, రుద్రయ్య ఆచారి, జీవేశ్వర్ ఆచారి, పృథ్వీ ఆచారి, వార్డు ఇన్చార్జి కె.రామాచారి, విశ్వకర్మ మహిళామణులు, కమిటీ సభ్యులు కె. విశాలాక్షి, హరిష తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ వాడకాన్ని మానేద్దాం

- వ్యాపారులకు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు పిలుపు
- ప్రతి దుకాణం వద్ద డస్ట్‌బిన్ తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలి
- ప్లాస్టిక్ విక్రయాలు, వినియోగంపై నిరంతర తనిఖీలు





పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : పర్యావరణానికి, ప్రజారోగ్యానికి హానికరమైన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా మానేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు వ్యాపారులు, ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం పాత బస్టాండ్ ప్రాంతంలోని దుకాణాలను సందర్శించి, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై వ్యాపారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో ప్లాస్టిక్ విక్రయాలు, వినియోగాన్ని వ్యాపారులు, ప్రజలు స్వచ్ఛందంగా పూర్తిగా నిలిపివేయాలని కోరారు. నిషేధిత ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టేందుకు నగరపాలక సంస్థ నిరంతరం ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తోందని తెలిపారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 201 దాడులు నిర్వహించి 250 కిలోలకు పైగా నిషేధిత ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై రూ.1,95,150 జరిమానాలు విధించినట్లు పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, ప్లాస్టిక్‌కు బదులుగా వస్త్ర, కాగిత సంచులు వంటి పర్యావరణ హిత ప్రత్యామ్నాయాలను వినియోగించాలని సూచించారు. అలాగే ప్రతి వ్యాపార సంస్థ తమ దుకాణం ముందు తప్పనిసరిగా డస్ట్‌బిన్ ఏర్పాటు చేసుకోవాలని, చెత్తను రోడ్లపై వేయకుండా అందులోనే వేయాలని సూచించారు. నగర పరిశుభ్రతకు ప్రతి వ్యాపారి భాగస్వామి కావాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకుముందు సుంకేసుల రోడ్డు, ఎన్.ఆర్.పేట తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణను కమిషనర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలోని అన్న క్యాంటీన్‌ను సందర్శించి అక్కడ అందిస్తున్న సేవలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, సానిటరీ సూపర్వైజర్ రమేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మల్లికార్జున, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఖాన్ బ్రదర్స్ సేవా గుణం అభినందనీయం: మంత్రి టీజీ భరత్

- రూ.36 లక్షల సొంత ఖర్చుతో పేదలకు ఇళ్ల నిర్మాణం
- నూతన గృహాలను ప్రారంభించిన రాష్ట్ర మంత్రి





పల్లె వెలుగు కర్నూలు బ్యూరో కర్నూలు నగరంలోని 11వ వార్డు డబరా ప్రాంతంలో నిరుపేదలకు సొంత ఖర్చుతో ఇళ్లు నిర్మించి ఇచ్చిన తెలుగుదేశం పార్టీ నాయకులు ఖాన్ బ్రదర్స్ సేవా గుణం ఎంతో అభినందనీయమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ కొనియాడారు. ఖాన్ బ్రదర్స్ రూ.36 లక్షల సొంత నిధులతో నిర్మించిన రెండు నూతన గృహాలను మంత్రి సోమవారం రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ... అనాథలైన పార్వతమ్మ, రాజు అనే ఇద్దరు నిరుపేదల ఇళ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరిన విషయాన్ని గమనించి, ఖాన్ బ్రదర్స్ మానవత్వంతో ముందుకు రావడం గొప్ప విషయమన్నారు. తమ పార్టీ నాయకులు ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం గర్వకారణమని, వీరిని స్ఫూర్తిగా తీసుకుని మరికొందరు పేదల సంక్షేమానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

**మంత్రి అడుగుజాడల్లోనే మా పయనం: మెహబూబ్ ఖాన్**

ఖాన్ బ్రదర్స్ ప్రతినిధి మెహబూబ్ ఖాన్ మాట్లాడుతూ... నిరంతరం ప్రజల్లో ఉంటూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మంత్రి టీజీ భరత్ ఆశయాలకు, ఆయన సేవా మార్గానికి ఆకర్షితులమై తాము ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. భవిష్యత్తులోనూ తమ వంతుగా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

**కన్నీళ్లు తుడిచిన ఖాన్ బ్రదర్స్:** లబ్ధిదారుల ఆనందం తమ దీనస్థితిని చూసి, రూపాయి ఖర్చు లేకుండా సుమారు రూ.36 లక్షల వ్యయంతో పక్కా ఇళ్లను నిర్మించి ఇచ్చిన ఖాన్ బ్రదర్స్ చేసిన మేలును జీవితంలో మర్చిపోలేమని లబ్ధిదారురాలు పార్వతమ్మ భావోద్వేగానికి లోనయ్యారు. తమకు శాశ్వత నీడను కల్పించినందుకు మంత్రి టీజీ భరత్‌కు, ఖాన్ బ్రదర్స్‌కు లబ్ధిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఓటు హక్కును కాపాడుకోండి: తెదేపా నేత



మహానంది, పల్లె వెలుగు మహానంది మండలంలోని ప్రజలందరూ తమ ఓట హక్కును కాపాడుకోవాలని తెలుగుదేశం పార్టీ మండల క్లస్టర్ ఇన్చార్జి నరాల చంద్రమౌళీశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. గతంలో సర్ కార్యక్రమం 2002 సంవత్సరంలో జరుగగా ప్రస్తుతం మళ్లీ సవరణ జరుగుతుందన్నారు. ఓటర్లు తమ ఎన్యూమరేషన్ సరిచూసుకోవడానికి వివరాల నమోదు ప్రక్రియ ముగియడానికి ఇంకా కేవలం ఒక్కరోజు మాత్రమే గడువు మిగిలి ఉందని గుర్తుచేశారు. ఓటర్లు తమ ఓటు భద్రత కోసం వెంటనే చొరవ తీసుకోవాలని ఆయన కోరారు. ఈ ప్రక్రియలో భాగంగా క్రింది వివరాలను జాగ్రత్తగా పరిశీలించుకోవాలని, మీ పేరు, చిరునామా సరిగ్గా ఉన్నాయో లేదో చూసుకోవాలి. కుటుంబ వివరాలు, సర్వే వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలన్నారు. ఆలస్యం చేయకుండా ఈరోజే మీ బూత్ లెవెల్ ఆఫీసర్ కు ఫారం అందజేయాలని,ఫారం సమర్పించిన తర్వాత తప్పనిసరిగా బూత్ లెవెల్ ఆఫీసర్ సంతకం తీసుకోవాలన్నారు. అదే మీ ఓటు భద్రతకు గ్యారెంటీ అని ఆయన స్పష్టం చేశారు.ఓటు హక్కు అనేది ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఈ చివరి ఒక్క రోజును సద్వినియోగం చేసుకొని అందరూ తమ ఓటును సురక్షితం చేసుకోవాలని ఆయన కోరారు.

# సర్ ప్రక్రియను వేగవంతం చేసి గడువు లోపు పూర్తి చేయండి

**ఆర్డీవో విశ్వనాధ్**

దొర్నిపాడు జూలై 13 పలివెలుగు న్యూస్ దొర్నిపాడు ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ప్రక్రియను పారదర్శకంగా వేగవంతం చేసి గడువులోపు పూర్తి చేయాలని తాసిల్దార్ సుభద్రను ఆర్డీవో విశ్వనాథ హెచ్చరించా రు, ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో దొర్నిపాడు వెనుకబడి ఉందిఅన్నారు, మండలంలోని బిఎల్ఓ లందరూ సర్ ప్రక్రియను చేస్తున్నారని గడువు లోపు పూర్తి చేస్తామనితాసిల్దార్అన్నారుసోమవారం దొర్నిపాడులో జరుగుతున్న సర్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. అర్హులైన వారు ఓటు హక్కు నష్టపోకుండా చూడాలని, అన్ని వివరాలను సమగ్రంగా సేకరించాలని ఆదేశించారు. సర్ ప్రక్రియ 14తో ముగుస్తుందని బీఎల్వోలు, రెవన్యూ అధికారులు, సూపర్వైజర్లర్లు ప్రత్యేక శ్రద్ధకనబరిచిడిజిటలైజేషన్ వందశాతం పూర్తి చేయాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నేటి వరకు మండలంలో 98.87 శాతం పూర్తి చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుభద్ర, డిప్యూటీ తహసీల్దార్ మాధవ వీఆర్వోలు, బి ఎల్ వో లు పాల్గొన్నారు

# ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలి: రాష్ట్ర కురుబ, కురుమ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప



ఆదోని (పల్లె వెలుగు): జూలై 12: ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎం ఫసల్ బీమా యోజన) పథకాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర కురుబ, కురుమ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప కోరారు. భారతదేశానికి రైతే వెన్నెముక అని, రైతు పంట పండిస్తేనే దేశ ప్రజలు కడుపునిండా భోజనం చేసి జీవిస్తారని ఆయన పేర్కొన్నారు. వాతావరణ పరిస్థితుల కారణంగా పంటలు దెబ్బతిన్నప్పుడు రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో, రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను అమలు చేస్తోందన్నారు. ప్రస్తుత ఏడాదిలో వాతావరణ పరిస్థితులు అనిశ్చితంగా ఉన్న నేపథ్యంలో రైతులు తప్పనిసరిగా తమ పంటలను ఈ–క్రాప్‌లో నమోదు చేసుకొని, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద బీమా చేయించుకోవాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాలు లేదా ఇతర కారణాలతో పంట నష్టం సంభవించినట్లయితే, అర్హులైన రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పంట నష్టపరిహారం అందే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి రైతు తన పొలంలో సాగు చేస్తున్న ప్రతి పంటను ఈ–క్రాప్‌లో నమోదు చేసుకోవడంతో పాటు, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం గ్రామ సచివాలయాలు, మీ సేవ కేంద్రాలు లేదా పంట రుణం పొందిన సంబంధిత బ్యాంకులను సంప్రదించి బీమా నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని రైతులకు సూచించారు.

# నేటి నుంచి పొలం పిలుస్తోంది కార్యక్రమం.



రుద్రవరం. పల్లె వెలుగు : రుద్రవరం మండలంలో వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో రైతుల కోసం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నేటి నుంచి ప్రారంభం కానుందని మండల వ్యవసాయ అధికారి జి. సుమతి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూప్రతి మంగళ, బుధవారాల్లో నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా సాగు చేసిన పంటలకు సోకే పురుగులు, తెగుళ్ల నివారణతో పాటు సమగ్ర పంటల యాజమాన్యంపై రైతులతో నేరుగా చర్చించి తగిన సలహాలు, సూచనలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ నెల షెడ్యూల్ ప్రకారం జులై 14న కె.కొత్తూరు, చెంచుగూడెం (కోటకొండ ఆర్.ఎస్.కె), 15న కోటకొండ, పెద్దకంబలూరు, 21న డి.కొట్టాల, శ్రీరంగపురం, 22న బీరవోలు, ఎల్లవత్తుల, 28న అప్పనపల్లె, చిన్నకంబలూరు, మరియు 29వ తేదీన కొండమాయపల్లె, బి.నాగిరెడ్డిపల్లె గ్రామాల్లో అధికారులు పర్యటించి ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

## వన్యప్రాణుల వేటగాళ్లు అరెస్ట్..
# 27 వరకు రిమాండ్

మహానంది, పల్లె వెలుగు మహానంది మండలం బుక్కాపురం గ్రామపంచాయతీ పరిధిలోని తెలుగు గంగ ప్రధాన కాలువ వెంకటసుబ్బయ్య బ్రిడ్జి వద్ద వన్యప్రాణులను వేటాడి మాంసం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు నంద్యాల రేంజ్ ఆఫీసర్ మురళీకృష్ణ



తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. అడవి వన్యప్రాణులైన అడవి పంది, అడవి పిల్లిని కరెంట్ షాక్ తో చంపి అరటి తోటలో మాంసం విక్రయిస్తుండగా పట్టుకునేందుకు ప్రయత్నించామన్నారు. ముగ్గురు వ్యక్తులు ఉండగా ఇద్దరు దొరికారని ఒకరు పారిపోయారు అన్నారు. దొంబర వెంకటేష్, (తిమ్మాపురం), దిమ్ము రమేష్,(పుట్టపల్లె). చెంచు నాగరాజు (కృష్ణ నంది) వీరిపై వన్యప్రాణి సంరక్షణ చట్టం- 1972 ప్రకారం నిందితులపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఇద్దరినీ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా ఈనెల 27 వరకు రిమాండ్కు ఆదేశించినట్లు తెలిపారు. పరారీలో ఉన్న వ్యక్తిని గాలింపు చర్యలు చేపడుతున్నామని, త్వరలో పట్టుకుంటామన్నారు. అటవీ ప్రాంతంలో ఉచ్చులు వేయడం, కరెంటు తీగలు లాగి అటవీ జంతులను వేటాడి మాంసాన్ని విక్రయించడం, తినడం చేస్తే చట్టరీత్యా నేరం అన్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహానంది డిఆర్ఓ హైమావతి, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

## కల్లూరులో జాయింట్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

☛ వీకర్ సెక్షన్ కాలనీ, సచివాలయం పరిశీలన

☛ పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన జేసీ

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో కల్లూరు మండల పరిధిలో సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ (జేసీ) ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్థానిక తహశీల్దార్‌తో కలిసి జేసీ పలు





ప్రాంతాలను సందర్శించి, క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. ఇందులో భాగంగా కల్లూరులోని వీకర్ సెక్షన్ కాలనీని సందర్శించిన ఆయన, అక్కడ స్థానికులకు అందుతున్న మౌలిక వసతులపై ఆరా తీశారు. అనంతరం 97వ నంబర్ సచివాలయాన్ని తనిఖీ చేసి, సిబ్బంది హాజరు పట్టికను, రికార్డులను పరిశీలించారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ప్రభుత్వ సేవలను సకాలంలో అందించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. అదేవిధంగా మండలంలోని 106, 108, 112 నంబర్ల గల పోలింగ్ కేంద్రాలను (రూ) జాయింట్ కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కేంద్రాలలో ఓటర్లకు కల్పించాల్సిన కనీస సౌకర్యాల గురించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో కల్లూరు తహశీల్దార్, రెవెన్యూ అధికారులు మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## "దేవరగట్టులో పూర్ణాహుతితో ముగిసిన వరుణ యాగం"

**సమ్మతిగేరి రామిరెడ్డి ఆధ్వర్యంలో వరుణ యాగంలో పాల్గొన్న ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి**





హోళగుంద పల్లె వెలుగు జులై :13 హోలగుంద మండలం దేవరగట్టులో శ్రీ మళమాల్లేశ్వర స్వామి దేవాలయంలో సమ్మతిగేరి రామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరుణ యాగం సోమవారంతో ముగిసింది. పూజా కార్యక్రమంలో ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి పాల్గొన్నారు. సమ్మతిగేరి రామిరెడ్డి ఆహ్వానం మేరకు ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు, ఆలూరు నియోజకవర్గ కమిటీ సభ్యులు, మండల కమిటీ నాయకులు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, బీవీఆర్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్.ఎఫ్.ఐ ఆదోని నూతన పట్టణ కమిటీ ఎన్నిక.

☛విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్.ఎఫ్.ఐ నిరంతరం పోరాటం.

☛ఎస్.ఎఫ్.ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు తెలిపారు.



ఆదోని (పల్లె వెలుగు): ఈరోజు ఎస్ఎఫ్ఐ పట్టణ జనరల్ బాడీ సమావేశంలో ఎస్.ఎఫ్.ఐ నూతన పట్టణ కమిటీని ఎన్నుకోవడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిస్కారం కోసం ఎస్.ఎఫ్.ఐ నిరంతరం పని చేస్తుందని, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులు పోరాటాలకు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. ఆదోని పట్టణ నూతన కమిటీ 17మందితో ఆదోని పట్టణ నూతన పట్టణ కమిటీ ఎన్నుకోవడం జరిగింది. నూతన పట్టణ అధ్యక్షుడిగా సంజయ్ కుమార్ పట్టణ కార్యదర్శి శశిధర్, పట్టణ ఉపాధ్యక్షులుగా లోకేష్ , ఉమాకాంత్, రవి పట్టణ సహాయ కార్యదర్శులుగా పవన్, జగదీష్, జగన కమిటీ సభ్యులుగా, 11మంది ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. అనంతరం నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీ, పిలుపుతో పాటు ఆదోని పట్టణంలో డిగ్రీ కళాశాల భవనం నిర్మించేంత వరకు అదే విధంగా, ఆదోని మెడికల్ కళాశాల పనులు ప్రారంభించాలని స్థానిక విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామని వారు తెలిపారు.

# ఆదోనిలో బీసీ భవన్ ఏర్పాటు చేయాలి.

**● ఆదోని డివిజన్ బీసీ ఫెడరేషన్ నాయకులు. ● ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి వినతి పత్రం. ● బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి నాయుడు.**



ఆదోని (పల్లె వెలుగు): ఆదోని పట్టణంలో మహాత్మా జ్యోతిభాపూలే భవనం నిర్మాణం కొరకు ప్రభుత్వ భూమి కేటాయింపు మరియు ప్రభుత్వ నిధులతో నిర్మాణం చేపట్టవలసినదిగా వినతి

ప్రతి పట్టణంలో ఒక భవనం ఉండటం అవసరం. ఆదోని పట్టణంలో మహాత్మా జ్యోతిభాపూలే భవనం నిర్మాణం కొరకు కేంద్ర

మేము బిసి ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ తరపున మీకు ఈ వినతిపత్రం సమర్పించుచున్నాము. సామాజిక న్యాయం, విద్యా చైతన్యం మరియు బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయులు మహాత్మా జ్యోతిభాపూలే స్మారకార్థం ప్రాంతంలో ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి కేటాయించవలసినదిగా కోరుచున్నాము. ప్రభుత్వ నిధులతో భవన నిర్మాణం చేపట్టి, అందులో బీసీ, ఎస్సీ, ఎస్టి, మైనారిటీ విద్యార్థులకు ఉచిత కోచింగ్ సెంటర్, యువతకు నైపుణ్య శిక్షణ, మహిళా సంఘాల సమావేశాల కొరకు మందిరం ఏర్పాటు చేయవలసినదిగా కోరుచున్నాము. ఆదోని నియోజకవర్గంలోని బడుగు వర్గాలకు సొంత సమావేశ భవనం లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము. మీరు చొరవ తీసుకుని ఈ భవన నిర్మాణానికి సహకరిస్తే లక్షలాది ప్రజలకు మేలు జరుగుతుంది. కాబట్టి మా వినతిని సానుకూలంగా పరిగణించి తగు ఆదేశాలు జారీ చేయాలని ప్రార్థిస్తున్నాము. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ కురువ కార్పొరేషన్ అండ్ డెవలప్మెంట్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప, ఆదోని డివిజన్ వైస్ ప్రెసిడెంట్ కత్తి హనుమంతరావు, నరసింహులు, కురువ సంఘము జిల్లా అధ్యక్షులు మల్లికార్జున, మరియు ఆలూరు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ జయరాముడు, తదితరులు పాల్గొన్నారు.

# భక్తి పారవశ్యంలో విజయేంద్ర తీర్థుల రథోత్సవం

**● కోలాటాలు, భజనలతో రథోత్సవం ● జైజై ధ్వానాల మధ్య భక్తుల కోలాటాలు, భజనలతో అంబరాన్నంటిన ● భక్తుల సందడితో వీరాంజనేయ, శ్రీరామ వేషధారణలతో అలరించి ● అన్నదానంతో ముగ్ధులైన భక్తులు..**









హోళగుంద పల్లె వెలుగు జులై :13 హెళగుందలోని శ్రీ విజయేంద్ర తీర్థుల బృందావనంలో నిర్వహిస్తున్న 412వ ఆరాధన మహోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారి రథోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించారు. స్థానిక భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని "కోలన్న"లు వేస్తూ భక్తి పారవశ్యంలో నృత్యాలు చేయడంతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడాయి. రథోత్సవానికి ముందు గజ్జెహళ్లి గ్రామానికి చెందిన హరే శ్రీనివాస భజన మండలి సభ్యులు భజనలు చేస్తూ, నృత్యాలు ప్రదర్శించి భక్తులను విశేషంగా ఆకట్టుకున్నారు. వారి గానంతో పాటు భక్తుల ఉత్సాహభరిత నృత్యాలు సంబరాలను అంబరాన్నంటించాయి. అదేవిధంగా వీరాంజనేయస్వామి, శ్రీరాములవారి వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి భక్తులను అలరించాయి. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం గురు రాఘవేంద్ర స్వాముల గ్రహమూర్తులను ఏర్పాటు చేసి రథోత్సవాన్ని ప్రారంభించారు. స్థానిక బస్టాండ్ నుంచి కోటవీధుల గుండా సాగిన రథోత్సవం భక్తుల జయజయధ్వానాల మధ్య తిరిగి ఆలయానికి చేరుకుంది. ఈ మహోత్సవాల్లో ప్రత్యక్షజ్ఞాన సుధాప్రవచనాలు, సప్తాహం, తీర్థప్రసాదాలు, హోమాలు, శాస్త్ర పారాయణాలు, భజనలు, ధార్మిక కార్యక్రమాలు, మహామంగళహారతులు తదితర విశేష కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి ఆశీస్సులు పొందుతున్నారు. మహోత్సవాలకు హాజరైన భక్తుల కోసం ఆలయ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, గ్రామ పెద్దలు, స్వచ్ఛంద సేవకులు విశేషంగా కృషి చేశారు.



# రూ.150 కోట్లతో మురికినీటి శుద్ధి ప్లాంట్: మంత్రి టీజీ భరత్

**● అమృత్ 2.0 కింద 35 ఎంఎల్‌డీ ప్లాంట్‌కు భూమిపూజ, పైలాన్ ఆవిష్కరణ ● 18 నెలల్లోగా పనులు పూర్తి చేయడమే లక్ష్యం ● నదీ జలాలను కలుషితం కానివ్వం: మంత్రి టీజీ భరత్ గుప్తా ● డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే కర్నూలు అభివృద్ధి: ఎంపీ బస్తిపాటి నాగరాజు**





పల్లె వెలుగు కర్నూలు బ్యూరో కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని సమాంతరంగా ముందుకు తీసుకెళ్తూ ప్రజల శ్రేయస్సుకు నిరంతరం కృషి చేస్తోందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తా స్పష్టం చేశారు. కర్నూలు నగరంలో మురికినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రూ.150 కోట్ల వ్యయంతో, అమృత్ 2.0 పథకం కింద నిర్మించనున్న 35 ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్స్ పర్ డే) సామర్థ్యం గల మురికినీటి శుద్ధి ప్లాంట్ (ర్యా) పనులకు సోమవారం ఆయన భూమిపూజ చేసి, పైలాన్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు, కుడా (ఖఖణూా) చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పం ప్రకారం రాష్ట్రంలో ఎక్కడా మురికినీరు నదుల్లో కలవకూడదనే లక్ష్యంతో కార్యాచరణ చేపట్టామన్నారు. గత కృష్ణ పుష్కరాల సమయంలో మురికినీరు తుంగభద్రలో కలవడం వల్ల భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. నదీ జలాలు కలుషితం కాకుండా నిరోధించేందుకే ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నామని, దీనిని 18 నెలల కాలపరిమితిలోగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ప్లాంట్‌లో శుద్ధి చేసిన నీటిని పరిశ్రమలకు, వ్యవసాయానికి అతి తక్కువ ధరకే అందుబాటులోకి తెస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ఒకవైపు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తూనే, మరోవైపు రహదారుల నిర్మాణం, పరిశ్రమల స్థాపన లాంటి అభివృద్ధి పనులను వేగవంతం చేస్తోందని, ప్రజలు ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు.

**స్మార్ట్ సిటీగా కర్నూలు: ఎంపీ బస్తిపాటి నాగరాజు**

కర్నూలు పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్రాల్లో కూటమి ప్రభుత్వం ఉండటం వల్ల 'డబుల్ ఇంజన్ సర్కార్' ద్వారా అత్యధికంగా నిధులు రాబట్టి కర్నూలు జిల్లాను వేగంగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. కర్నూలు నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దేందుకు మంత్రి టీజీ భరత్ భగీరథ ప్రయత్నం చేస్తున్నారని కొనియాడారు. అనంతరం కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నగర ప్రగతికి అహర్నిశలు శ్రమిస్తున్న మంత్రి, ఎంపీలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ హజ్ కమిటీ డైరెక్టర్ సూరి మన్సూర్ అలీ ఖాన్, కర్నూలు మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రఘు, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ రామ్మోహన్ యాదవ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గుర్రప్ప యాదవ్, మున్సిపల్ ఇంజనీరింగ్ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం.

**● కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్. ● పజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమానికి 112 ఫిర్యాదులు. ● ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి, పరిష్క రించాలని పోలీసు అధికారులను ఆదేశించిన జిల్లా ఎస్పీ.**





పల్లెవెలుగు కర్నూలు క్రైమ్. కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ వారి క్యాంపు కార్యా లయంలో కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ వారు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్య క్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరి ష్కార వేదిక కార్య క్రమంకు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలు సుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 112 ఫిర్యాదులు వచ్చాయి.

వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ...

1) పెరుమాళ్ల విజయ్ కర్నూలు కలెక్టర్ కార్యాలయంలో అటెండర్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ. 34 వేలు తీసుకుని మోసం చేశాడని కృష్ణగిరి మండలం , పుట్లూరు గ్రామానికి చెందిన ఎస్. హుస్సేన్ ఫిర్యాదు చేశారు. 2) నా కుమారుడు షణ్ముఖ మృతి పై అనుమానం ఉందని సమగ్ర విచారణ జరిపించి న్యాయం చేయాలని ఓర్వకల్లు మండలం , హుసేనాపురం గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ ఫిర్యాదు చేశారు. 3) సెలూన్, బ్యూటీ పార్లర్, టాటూ స్టూడియోలకు ఫ్రాంచైజీ ఇస్తామని నమ్మించి అగ్రిమెంట్ చేసుకుని, మెటీరియల్ పేరుతో రూ. 60 లక్షలు తీసుకుని హైదరా బాద్ కు చెందిన మార్కెటింగ్ మేనేజర్ బృహస్పతి రావు ,నరస రావుపేటకు చెందిన అశ్రఫ్ వలి మోసం చేశారని కర్నూలుకు చెందిన చకిత ఫిర్యాదు చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదు లన్నింటి పై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తా మని సమస్యలను త్వరితగతిన పరిష్క రిస్తామని ఈ సంధర్భంగా కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ హామీ ఇచ్చారు.ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్య క్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా సిఐలు శివశంకర్ ఇస్మాయిల్ మస్తాన్ వలి లు పాల్గొ న్నారు.

# ప్రజలకు అవగాహన చేయకుండా" సర్ "ప్రక్రియ ముగుస్తున్నానడం దుర్మార్గం. సిపిఐ .

**పట్టణ గ్రామ సభలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించి "సర్ "ప్రక్రియ 3 నెలలు పొడిగించాలి..సిపిఐ .**



పల్లె వెలుగు నంద్యాల రూరల్.రాష్ట్రంలో ప్రజలకు గ్రామసభలు వార్డు సభలు నిర్వహించకుండా అవగాహన కల్పించకుండా ఎన్నికల అధికారులు ఈనెల 14 వ తేదీ"సర్" ప్రక్రియ ముగిస్తుందని ప్రజలకు తెలపడం దుర్మార్గమని ప్రజలకు అవగాహన కల్పించి మరో 3 నెలలు గడువు పెంచాలని సిపిఐ రాష్ట్ర సమితి పిలుపునిచ్చింది . జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి అనంతరం జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకు మారి గణియా గారికి డిమాండ్స్ కూడిన వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలోసిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్ సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జి నాగరాముడు.. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి సోమన్న.సిపిఐ జిల్లా సమితి సభ్యులు డి శ్రీనివాసులు పట్టణ సహాయ కార్యదర్శి భూమిని శ్రీనివాసులు. సిపిఐ నాయకులు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 70/శాతం ఓట్లు రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందని ఎన్నికల అధికారులు. సర్ ప్రక్రియ పై బి ఎల్ వో లకు అవగాహన కల్పించిగ్రామ సభలు నిర్వహించి ప్రజలకు కూడా అవగాహన కల్పించాల్సి ఉండగా అలాంటి ప్రక్రియ ఎక్కడ జరగకపోగా ఈనెల 14తో గడువు ముగిస్తుందని చెప్పడం దుర్మార్గమని జిల్లా కలెక్టర్. ఎన్నికల అధికారులు స్పందించి ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమం. చేపట్టేందుకు కృషి చేయాలని సర్ ప్రక్రియ పూర్తి అయ్యే నాటికి ఓట్లు తొలగించే కార్యక్రమం జరుగుతుందని విమర్శించారు.

ఎన్నికల అధికారులు సర్ లో చని పోయిన వారివి , విదేశాల నుండి వచ్చిన వారి ఓట్లు తొలగిస్తే అభ్యంత్రం లేదు గాని సర్ పేరుతొ అధికార పార్టీ వారికి బీజేపీ కి వ్యతిరేకంగా ఉండే నిజమైన ఓటర్లను తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఓటు నమోదుకు గతంలో రేషన్ కార్డు, ఆధార్ కార్డు పాస్ పోర్ట్ ప్రామాణికంగా ఉండేవాని ఇప్పుడు అవేమి పనికి రావంటున్నారు... బీజేపీ, ఆర్ ఎస్ ఎస్ సభ్యత్వం కార్డులు మాత్రమే ప్రామాణికమా అని ప్రశ్నించారు.

నంద్యాల జిల్లా వ్యాప్తంగా ఎన్నికల అధికారులు 100% ఫారాలు ఇచ్చామని వాటిలో ఇప్పటివరకు 70 శాతం ఓట్లు మాత్రమే ఆన్లైన్ అయినావని నంద్యాల పట్టణంలోని మిగిలిన ఓట్లు మూడు రోజుల్లోనే ఎంతవరకు ఆన్లైన్ అవుతాయని నమ్మకం లేదని వీటిలో అరులైన ఓట్లు తొలగిపోయే ప్రమాదం ఉంది కావున జిల్లా కలెక్టర్ ఉన్నత అధికారులు రాష్ట్ర ఎన్నికల సంఘం నుండి గడువు పొడిగించేందుకు అనుమతులు తీసుకోవాలని పై నాయకులు అధికారులను కోరారు.

## అంతర్జాతీయ తెలుగు రచయిత్రుల సదస్సులో ప్రతిభ కనబరిచిన సీతామహాలక్ష్మికి సన్మానం

రంగంపేట, జూలై 13 (పల్లె వెలుగు) :- విజయవాడ కేబీఎన్ కళాశాలలో జరిగిన మూడవ



అంతర్జాతీయ తెలుగు రచయిత్రుల సమావేశంలో విశేష ప్రతిభ క న బ రి చి న ఆంధ్రభాషోపాధ్యాయురాలు శ్రీపాద సీతామహాలక్ష్మిని రంగంపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రధానోపాధ్యాయుడు వి. పార్థసారథి ఆమెను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేటి సమాజంలో విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దే అంశంపై సీతామహాలక్ష్మి అందించిన ప్రసంగం ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. పాఠశాలలో తెలుగు భాషాభివృద్ధికి ఆమె చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. తనకు లభించిన గౌరవం పట్ల సన్మాన గ్రహీత శ్రీపాద సీతామహాలక్ష్మి కృతజ్ఞతలు తెలుపుతూ, ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ కళావేదికపై 800 మంది రచయిత్రుల సమక్షంలో విద్యాభివృద్ధిపై తన అభిప్రాయాలను పంచుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జాకబ్, గణేష్, ఓమి ప్రసాద్, వీరబాబు, కామేశ్వరి, సావిత్రి, స్వాతి కుమారి, భారతి, వెంకటలక్ష్మి, విజయలక్ష్మి, పుష్పలత, శైల, సత్యవేణి తదితరులు పాల్గొన్నారు

## ఉభయ గోదావరి అభివృద్ధికి సీఎం చంద్రబాబు నాయుడు చారిత్రాత్మక అడుగు

రాజానగరం, జూలై 13 (పల్లె వెలుగు) :- రాజానగరం నియోజకవర్గంలోని వేమగిరి



హెలిపాడ్ వద్ద ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొడ్డు వెంకటరమణ చౌదరి మరియు రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఉభయ గోదావరి జిల్లాల జీవనాడిగా నిలిచిన ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీకి రూ.150 కోట్ల వ్యయంతో చేపట్టనున్న నూతన గేట్ల ఏర్పాటు పనుల శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. అనంతరం పురుషోత్తపట్నం ప్రాంత రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ముఖ్యమంత్రితో బొడ్డు వెంకటరమణ చౌదరి మరియు బత్తుల బలరామకృష్ణ చర్చించారు. సాగునీరు మరియు వ్యవసాయ రంగంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరగా, ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు మరియు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

## ఇర్రిపాక శివకేశవ క్షేత్రంలో ఘనంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు

జగ్గంపేట, జూలై 13 (పల్లె వెలుగు) :- ఇర్రిపాకలోని ఏలేరు నది తీరాన ఉన్న ప్రసిద్ధ శివకేశవ క్షేత్రంలో సోమవారం మాస శివరాత్రి, ఆరుద్ర నక్షత్రం, అమావాస్య కలయికతో





కూడిన విశిష్టమైన ఆధ్యాత్మిక పర్వదినాన ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు పాలచర్ల నాగేంద్ర చౌదరి తన కుటుంబ సమేతంగా ఆలయాన్ని సందర్శించి స్వామివారికి పంచామృతాభిషేకం మరియు ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. నాగేంద్ర చౌదరి కుమారుడు ఈశ్వర్ జన్మ నక్షత్రం ఆరుద్ర కావడంతో, ఈ పవిత్ర దినాన ఆయన చేతుల మీదుగా పరమేశ్వరునికి పూజా కార్యక్రమాలు నిర్వహించడం తమకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని నాగేంద్ర చౌదరి పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాలచర్ల నాగేంద్ర చౌదరి మాట్లాడుతూ శివకేశవులు ఒకే దిశలో కొలువై ఉన్న ఈ క్షేత్రానికి ఎంతో ఆధ్యాత్మిక ప్రాముఖ్యత ఉందని తెలిపారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చొరవతో ఆలయం ఎంతో అభివృద్ధి చెందిందని, భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయని ఆయన అభినందించారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్న జ్యోతుల నెహ్రూకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగేంద్ర చౌదరి కుటుంబ సభ్యులు మరియు భక్తులు పాల్గొన్నారు

## ఇర్రిపాక శివకేశవ ఆలయానికి పోటెత్తిన భక్తజనం

జగ్గంపేట, జూలై 13 (పల్లె వెలుగు) :- సోమావతి అమావాస్య, మాస శివరాత్రి మరియు ఆరుద్ర నక్షత్రం ఒకే రోజు రావడంతో కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం ఇర్రిపాకలోని తిరుమల తిరుపతి దేవస్థానముల శివకేశవుల ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఏలేరు





నది ఒడ్డున వెలసిన శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి, శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. భక్తులు ఏలేరు నదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివార్లను దర్శించుకున్నారు. కోటి లింగేశ్వర స్వామికి అర్చనలు, అభిషేకాలు మరియు ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఈ అరుదైన మహా శైవాక్షయోగం సందర్భంగా నిర్వహించిన శివారాధనలో పాల్గొనేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ధర్మకర్త, జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ, మణి దంపతులు పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తాగునీరు, తీర్థప్రసాదాల పంపిణీ మరియు క్యూ లైన్లను పటిష్టంగా ఏర్పాటు చేశారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు

# ప్రజా ఆస్తుల పరిరక్షణకై జులై 25న నంద్యాలలో మహా సత్యాగ్రహ దీక్ష.

**రైతుల మార్కెట్ యార్డు భూములను రాజకీయ పార్టీ కార్యాలయాలకు కేటాయించడంపై తీవ్ర ఆందోళన.**

**వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్ ఏ ఆర్ ఎస్) భవితవ్యానికి తూట్లు పొడుస్తున్న ప్రభుత్వం.**



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ప్రజల ఆహార భద్రతకు అత్యంత కీలకమైన నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్ ఏ ఆర్ ఎస్)లో ఏర్పాటు చేసిన తాత్కాలిక కలెక్టరేట్ కార్యాలయాన్ని తరలించడానికి ప్రభుత్వ స్థలాలు లేవని చెప్పే ప్రభుత్వం, రాజకీయ పార్టీల అవసరాల కోసం మాత్రం కోట్ల రూపాయల విలువైన ప్రజా ఆస్తులను కారుచౌకగా కేటాయించడం ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని అఖిలపక్ష ఐక్యవేదిక విమర్శించింది.

ఈ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా జులై 25 (శనివారం) ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు నంద్యాల టెక్కె మార్కెట్ యార్డ్ వద్ద మహా సత్యాగ్రహ దీక్ష నిర్వహించాలని సోమవారం నంద్యాలలో అఖిలపక్ష ఐక్యవేదిక కన్వీనర్ ఏరువ రామచంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన సన్నాహక సమావేశంలో నిర్ణయించారు. ఈ సందర్భంగా సత్యాగ్రహానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. సమావేశంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ, నూనెపల్లె మార్కెట్ యార్డులో సుమారు రూ.60 కోట్ల విలువైన రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని తెలుగుదేశం పార్టీ కార్యాలయ నిర్మాణానికి ఏడాదికి కేవలం రూ.1,000 లీజుతో 33 సంవత్సరాలకు కేటాయించడం రైతుల ప్రయోజనాలను కాలరాసే చర్య అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ఆస్తులను రాజకీయ అవసరాలకు వినియోగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి, ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని పేర్కొన్నారు.

అలాగే 120 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్ ఏ ఆర్ ఎస్) రాయలసీమ వ్యవసాయాభివృద్ధికి విశేష సేవలు అందించిందని, అలాంటి పరిశోధన సంస్థను తాత్కాలిక కలెక్టరేట్ పేరుతో బలహీనపరచడం నంద్యాల వ్యవసాయ భవిష్యత్తుకే కాకుండా దేశ ఆహార భద్రతకూ ముప్పుగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారంలోకి వస్తే కలెక్టరేట్‌ను తరలిస్తామని ఇచ్చిన హామీని రెండున్నర సంవత్సరాలైనా అమలు చేయకపోవడం దురదృష్టకరమన్నారు.

**ఇంటింటికీ ప్రచారం... పదివేల కుటుంబాల మద్దతే లక్ష్యం.**

మహా సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయడానికి ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు కలిసి 100 బృందాలుగా ఏర్పడి, ప్రతి బృందం నేటి నుండి సత్యాగ్రహం జరిగే 25 వరకు 10 రోజులపాటు ప్రతిరోజూ కనీసం 10 కుటుంబాలను ప్రత్యక్షంగా కలుస్తూ, ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఈ ప్రచారం ద్వారా పదివేల కుటుంబాలకు చేరుకొని, నూనెపల్లె మార్కెట్ యార్డు భూమి కేటాయింపు, ఆర్ ఏ ఆర్ ఎస్ పరిరక్షణ, ప్రజా ఆస్తుల రక్షణ వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించి, మహా సత్యాగ్రహ దీక్షకు విస్తృత ప్రజా మద్దతును కూడగట్టాలని నిర్ణయించారు.

**సత్యాగ్రహ ప్రధాన డిమాండ్లు.**

నూనెపల్లె మార్కెట్ యార్డు భూమి కేటాయింపును వెంటనే రద్దు చేయాలి.

నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్ ఏ ఆర్ ఎస్) నుంచి తాత్కాలిక కలెక్టరేట్ కార్యాలయాన్ని వెంటనే తరలించాలి.

రైతు సంక్షేమం కోసం మార్కెట్ యార్డులు, వ్యవసాయ పరిశోధన సంస్థలను బలోపేతం చేయాలి.

ప్రజా ఆస్తుల పరిరక్షణ, వ్యవసాయ రంగ పరిరక్షణతోనే రాయలసీమ సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొంటూ, జులై 25న జరిగే మహా సత్యాగ్రహ దీక్షలో రైతులు, మేధావులు, యువత, ప్రజా సంఘాలు, ప్రజాసంఘాల ప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అఖిలపక్ష ఐక్యవేదిక పిలుపునిచ్చింది.

ఈ సమావేశంలో రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్, న్యాయవాది శంకరయ్య, కె.సి. కెనాల్ పరిరక్షణ సమితి నాయకులు బెక్కం రామసుబ్బారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు మస్తాన్, ఎస్ డి పి ఐ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజాస్ హుసేన్, క్రిస్టియన్ జేఏసీ నాయకుడు జానయ్య, వెలుగోడు రైతు సంఘం నాయకుడు నస్రుల్లాఖాన్, భాస్కర్ రెడ్డి, ఎస్సార్ బీసీ పరిరక్షణ నాయకుడు మురళీధర రెడ్డి, ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక నాయకులు ఆకుమల్ల రహీం, షణ్ముఖరావు, పిడిఎస్యు విద్యార్థి సంఘం నాయకుడు రాంబాబు, న్యూ డెమోక్రసీ పార్టీ నాయకుడు చౌడప్ప, బసవేశ్వర రైతు సంఘం నాయకుడు ఎం.సి. కొండారెడ్డి, వెల్ఫేర్ పార్టీ నాయకుడు అన్వర్ భాష, వాల్మీకి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బోయ పులికొండన్న, చిరు వ్యాపారుల సంఘం నాయకుడు సత్యనారాయణ, బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు కుమ్మరి ప్రసాద్, గడివేముల మండల రైతు సంఘం కన్వీనర్ ఈశ్వర్ రెడ్డి, నేపథ్య గాయకులు శివరామిరెడ్డి, నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## జలధార-జలహారతి పనులు వేగవంతం చేయాలి.

**● జిల్లాలకు రూ.2 కోట్ల నిధుల విడుదలకు ముఖ్యమంత్రి ఆదేశాలు. ● రాష్ట్రవ్యాప్తంగా జలధార కార్యక్రమ పురోగతిపై సీఎం చంద్రబాబు సమీక్ష. ● నంద్యాల జిల్లాలో చేపట్టిన పనుల వివరాలను వివరించిన జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా.**



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. జలధార-జలహారతి కార్యక్రమం అమలు పురోగతిపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం పోలవరం ప్రాజెక్టు సైట్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా నీటి వనరుల సంరక్షణ, భూగర్భ జలాల వృద్ధి, సాగునీటి సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి గణియా మాట్లాడుతూ, జిల్లాలో జలధార – జలహారతి కార్యక్రమం కింద చేపట్టిన చెరువుల పునరుద్ధరణ, ఫీడర్ చానళ్ల అభివృద్ధి, భూగర్భ జలాల వృద్ధికి చేపట్టిన పనుల పురోగతిని రాష్ట్ర ముఖ్యమంత్రికి వివరించారు. జూన్ నెల నుండి ఇప్పటివరకు జిల్లాలో నమోదైన వర్షపాతం సాధారణ వర్షపాతంతో పోలిస్తే తక్కువగా ఉన్నప్పటికీ, వర్షపు నీటిని గరిష్టంగా ఒడిసిపట్టేలా చేపట్టిన జలధార – జలహారతి పనులు ఆశించిన ఫలితాలను ఇస్తున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో గుర్తించిన జలధార పనుల్లో ఇప్పటికే 97 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను కూడా నిర్దేశిత గడువులో పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. నీటి వనరుల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, చెరువుల సామర్థ్యాన్ని పెంపొందించడం, భూగర్భ జలాలను పునరుజ్జీవింపజేయడం, సాగునీటి లభ్యతను మెరుగుపరచడం లక్ష్యంగా జిల్లా యంత్రాంగం కార్యాచరణను సమర్థవంతంగా అమలు చేస్తోందని ఆమె సియం కు వివరించారు. అంతకుముందు రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్రవ్యాప్తంగా ప్రాధాన్యతా క్రమంలో చేపట్టనున్న 36 సాగునీటి ప్రాజెక్టుల పురోగతిని సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా వెలిగొండ ప్రాజెక్టు, పోలవరం ఎడమ కాలువతో పాటు ఇతర ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల పనుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో సాగునీటి సామర్థ్యాన్ని గణనీయంగా పెంచే లక్ష్యంతో వచ్చే మూడేళ్లలో 36 సాగునీటి ప్రాజెక్టుల అమలుకు రూ.35,313 కోట్లు వెచ్చించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. అదేవిధంగా, ఏపీఎస్ఐడీసీ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 1,023 సాగునీటి పథకాల పునరుద్ధరణ పనులను చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ పనులకు రూ.3,883 కోట్ల వ్యయం అంచనా వేయగా, వీటి ద్వారా సుమారు 8.42 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందే అవకాశం ఉందని అధికారులు వివరించారు. జలధార కార్యక్రమం కింద 100 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 11,133 చెరువులు, ఫీడర్ చానళ్ల అభివృద్ధి పనులు చేపట్టినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. జలధార పనులను వీబీజీ రామ్‌జీ సంస్థ ద్వారా మరింత సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే, జలధార కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేసేందుకు ప్రతి జిల్లాకు రూ.2 కోట్ల చొప్పున అదనపు నిధులు విడుదల చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యనారాయణ, ఇరిగేషన్ సూపరింటెండింగ్ ఇంజనీర్ శంకర్ రెడ్డి, భూగర్భ జలాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రఘురాం తదితర అధికారులు పాల్గొన్నారు.

## సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల విద్యార్థుల మెస్ చార్జీలను పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా తక్షణమే పెంచాలి .




పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. యునైటెడ్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ మరియు నంద్యాల జిల్లా కమిటీ తరపున ఈ క్రింది సమస్యలను మీ దృష్టికి తీసుకొస్తున్నాము. యు ఎస్ ఎఫ్ ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి మాట్లాడుతూ

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సాంఘిక సంక్షేమ, వెనుకబడిన తరగతుల (బిసి), గిరిజన (ఎస్ టి) సంక్షేమ వసతి గృహాలతో పాటు గురుకుల పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థుల మెస్ బిల్లులను పెరిగిన ధరలకు అనుగుణంగా తక్షణమే నెలకు రూ. 3,000లకు పెంచాలని మా విద్యార్థి సంఘం డిమాండ్ చేస్తోంది.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ప్రారంభంలోనే విద్యార్థులకు మెస్ బిల్లులు పెంచుతామని, మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చింది. కానీ నేడు ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడుస్తున్నప్పటికీ, మెస్ చార్జీల పెంపుపై ఎలాంటి అధికారిక నిర్ణయం తీసుకోకుండా కాలయాపన చేయడం అత్యంత శోచనీయం. ప్రస్తుతం మార్కెట్‌లో నిత్యావసర వస్తువులు, కూరగాయలు, గ్యాస్, పాలు వంటి అన్ని వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. పాత చార్జీల ప్రకారమే నిధులు విడుదల చేస్తుండటంతో, వసతి గృహాల నిర్వాహకులు విద్యార్థులకు నాణ్యమైన మరియు పౌష్టికాహారాన్ని అందించలేకపోతున్నారు. దీనివల్ల వసతి గృహాల్లోని వేలాది మంది పేద విద్యార్థులు తీవ్రమైన పోషకాహార లోపానికి గురవుతున్నారు, తరచూ అనారోగ్యాల బారిన పడుతున్నారు.

**మా ముఖ్యమైన డిమాండ్లు:**

పెరిగిన ధరల దృష్ట్యా అన్ని రకాల సంక్షేమ హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలను తక్షణమే నెలకు రూ. 3,000లకు పెంచాలి.

సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో ఇరుకు గదుల మధ్య నడుస్తున్న వసతి గృహాలకు తక్షణమే ప్రభుత్వ నూతన భవనాలను నిర్మించాలి.

హాస్టళ్లలో తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణ, విద్యుత్ సరఫరా వంటి కనీస మౌలిక వసతులను మెరుగుపరచాలి.

విద్యార్థులకు ఇచ్చే కాస్మోటిక్ చార్జీలను కూడా ప్రస్తుత మార్కెట్ ధరలకు అనుగుణంగా పెంచాలి.

కావున, నంద్యాల జిల్లా కలెక్టర్ గారు ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకుని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఈ సమస్యలను తక్షణమే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని, అలాగే జిల్లా స్థాయిలో ఉన్న హాస్టళ్లపై ప్రత్యేక నిఘా ఉంచి తగిన చర్యలు తీసుకోవాలని వినమ్రంగా కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జయసింహా రెడ్డి జిల్లా కార్యదర్శి దేవానంద్ విద్యార్థి నాయకులు సురేష్, శివ, నరేష్,కళ్యాణ్, పాల్గొన్నారు.

## ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఆధ్వర్యంలోని ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరాన్ని ప్రారంభించిన రాష్ట్ర మంత్రిఎన్ఎండి ఫరూక్.






పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల మున్సిపల్ టౌన్ హాల్ లో నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఆధ్వర్యంలోని ఉచిత క్యాన్సర్ వైద్య పరీక్షల మహా శిబిరంను రాష్ట్ర న్యాయశాఖ, మైనారటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎం డి ఫరూక్ సోమవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి ఎన్ ఎం డి ఫరూక్ మాట్లాడుతూ హైదరాబాద్ లోని బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ చైర్మన్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రత్యేక చొరవతో ఈ ఉచిత క్యాన్సర్ శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

సుమారు రూ. 15,000 విలువైన క్యాన్సర్ పరీక్షలను ప్రజలకు ఉచితంగా అందిస్తున్నారని, ముందస్తు పరీక్షలతో క్యాన్సర్‌ను జయిద్దాం అనే నినాదంతో, క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలనే లక్ష్యంతో ఈ శిబిరాన్ని నిర్వహించారన్నారు . 30 ఏళ్లు పైబడిన మహిళలు, చెడు అలవాట్లు ఉన్నవారు, కుటుంబంలో క్యాన్సర్ చరిత్ర ఉన్నవారు, అనుమానాస్పద లక్షణాలు ఉన్నవారు ఈ సంచార క్యాన్సర్ స్క్రీనింగ్ వాహన సదుపాయాన్ని వినియోగించుకోవాలని మంత్రి ఫరూక్ కోరారు. క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే చికిత్స సులభతరమవుతుందని, నయం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు .

ఈ కార్యక్రమంలో నంద్యాల మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, సెంట్రల్ ఫుడ్ కమిషన్ మెంబర్ నరహరి విశ్వనాథ్ రెడ్డి , రాయలసీమ విద్యార్థి సంఘం వ్యవస్థాపకులు సీమ కృష్ణ , యం. వి.రమణారెడ్డి, వసుంధర దేవి, పలువురు ప్రజా ప్రతినిధులు, వైద్యులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా చర్యలు తీసుకోవాలి.



## అర్జీదారులతో నేరుగా మాట్లాడి సంతృప్తికరంగా సమస్యలు పరిష్కరించాలి.

**● వాట్సాప్ గవర్నెన్స్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయండి. ● పీజీఆర్ఎస్‌లో 334, రెవెన్యూ క్లినిక్స్‌లో 193 అర్జీల స్వీకరణ. ● జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**








పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల మేరకు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక అనంతరం వివిధ శాఖల పనితీరుపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, జిల్లా రెవెన్యూ అధికారి డి. రామునాయక్, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి ఉమామహేశ్వరి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రజల నుంచి స్వీకరించే ప్రతి అర్జీని అత్యంత ప్రాధాన్యంతో పరిశీలిస్తోందని తెలిపారు. అర్జీల పరిష్కారంపై అర్జీదారుల సంతృప్తి స్థాయిని ముఖ్యమంత్రి కార్యాలయం నేరుగా సమీక్షిస్తోందని పేర్కొన్నారు. అధికారులు కేవలం నివేదికలు సమర్పించడమే కాకుండా, అర్జీదారులను వ్యక్తిగతంగా కలిసి సమస్యను వివరించి పరిష్కరించే విధంగా వ్యవహరించాలని సూచించారు. దీనివల్ల ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం మరింత పెరుగుతుందన్నారు. నంద్యాల రూరల్ తహశీల్దార్ పరిధిలో ఇనాం భూమిని పట్టా భూమిగా మార్చి అర్జీదారుడి సమస్యను పరిష్కరించడం ప్రశంసనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. మరోవైపు జూపాడుబంగ్లా మండలంలో ఒక అర్జీకి సంబంధించి తప్పు సమాచారం అందించిన ఘటనను ప్రస్తావిస్తూ, ఇలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. అలాగే నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్నుకు సంబంధించి వచ్చిన ఫిర్యాదుపై కమిషనర్ స్వయంగా అర్జీదారుని కలిసి వివరణ ఇవ్వడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేసిన విషయాన్ని ఉదాహరణగా పేర్కొన్నారు. అర్జీదారులకు అందించే పరిష్కార నివేదికలపై సంబంధిత అధికారులు తప్పనిసరిగా సంతకం చేయాలని కూడా కలెక్టర్ స్పష్టం చేశారు.

### వాట్సాప్ గవర్నెన్స్ సేవలను మరింత విస్తృతంగా వినియోగించాలి

ప్రభుత్వ సేవలను ప్రజలకు ఇంటి వద్ద నుంచే అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో వాట్సాప్ గవర్నెన్స్ వ్యవస్థను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం సుమారు 1,500 ప్రభుత్వ సేవలు వాట్సాప్ ద్వారా అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డులకు వచ్చే ప్రతి పౌరునికి ఈ సేవలపై అవగాహన కల్పించి, కార్యాలయాలకు రాకుండానే ఇంటి నుంచే ప్రభుత్వ సేవలు పొందేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

### రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 193 అర్జీల స్వీకరణ

భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్స్ ప్రజలకు న వం ర్థ వం త వ్మై న వేదికగా నిలుస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ క్లినిక్స్ ద్వారా భూ సంబంధిత సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే అవకాశం కలుగుతోందన్నారు. రెవెన్యూ క్లినిక్స్‌లో మొత్తం 193 అర్జీలు స్వీకరించగా, వాటిలో రెవెన్యూ, గ్రామ/వార్డు సచివాలయ సేవలకు సంబంధించినవి 3, చుక్కల భూముల క్రమబద్ధీకరణ, 22-ఎ భూములకు సంబంధించినవి 4, అసైన్డ్ భూములు, భూ ఆక్రమణలకు సంబంధించినవి 39, రెవెన్యూ కోర్టు విచారణలు, ఆర్ఓఆర్‌కు సంబంధించినవి 73, సర్వే, రీ-సర్వే అంశాలకు సంబంధించినవి 61, దేవాదాయ, వక్ఫ్ భూములకు సంబంధించినవి 13 అర్జీలు ఉన్నట్లు కలెక్టర్ వివరించారు.

### పీజీఆర్ఎస్‌లో స్వీకరించిన ముఖ్యమైన అర్జీలు.

*1)జూపాడుబంగ్లా మండలం మండ్లెం గ్రామానికి చెందిన రాజా గౌడు, సర్వే నంబరు 542/బిలో ఉన్న 2.52 ఎకరాల భూమి చుక్కల భూమిగా నమోదైందని, దానిని పట్టా భూమిగా మార్చాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. 2)ఆళ్లగడ్డ మండలం బాచాపురం గ్రామానికి చెందిన అన్నెం కాశీ విశ్వనాథరెడ్డి, జి. జంబులదిన్నె గ్రామంలోని సర్వే నంబరు 300/2లో తనకు ఉన్న 3.60 ఎకరాల భూమికి రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతూ అర్జీ అందజేశారు. 3)కొత్తపల్లి మండలం దుద్యాల గ్రామానికి చెందిన ఎం. దిబ్బన్న, సర్వే నంబరు 1172లోని తన భూమిని ఇతరులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారని, దీనిపై విచారణ జరిపి న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.*

---

## మొరాలిటీ అండ్ డిజిటల్ ఎథిక్స్ క్యాంపెయిన్" సాంకేతిక రుగ్మతలకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్త ఉద్యమాన్ని(జులై 10-20) నంద్యాలలో లాంఛనంగా ప్రారంభించిన స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్.




పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), సామాజిక మాధ్యమాలు మరియు అల్గోరిథమ్ ఆధారిత సాంకేతికతలు నేడు మానవ జీవితంలోని ప్రతి రంగాన్ని ప్రభావితం చేస్తున్నాయి. డిజిటల్ విప్లవం విద్య, పాలన, వైద్యం, వాణిజ్యం, సమాచార రంగాల్లో అపూర్వమైన మార్పులు తీసుకువచ్చినప్పటికీ, మరోవైపు సైబర్ నేరాలు, తప్పుడు సమాచారం (మిస్ఇన్ఫర్మేషన్), డిజిటల్ వ్యసనం, గోప్యత ఉల్లంఘనలు, సైబర్ వేధింపులు, అసభ్య కంటెంట్, ఆన్లైన్ లైంగిక దోపిడీ, డీప్ ఫేక్లు వంటి తీవ్రమైన నైతిక సవాళ్లను కూడా సృష్టించాయి. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని నైతిక యువ కళా వేదిక ( ఎన్ వై కే వి), ఆంధ్రప్రదేశ్, స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ ఐ ఓ), ఆంధ్రప్రదేశ్ సహకారంతో రాష్ట్రవ్యాప్త మొరాలిటీ అండ్ డిజిటల్ ఎథిక్స్ క్యాంపెయిన్ కార్యక్రమాన్ని నంద్యాలలో లాంఛనంగా ప్రారంభించడం జరిగింది. ఈ క్యాంపెయిన్ ద్వారా బాధ్యతాయుతమైన డిజిటల్ పౌరసత్వం, కృత్రిమ మేధస్సు నైతికత, సైబర్ భద్రత, డిజిటల్ శ్రేయస్సు, మీడియా అవగాహన, గోప్యత పరిరక్షణ, డిజిటల్ వేదికలలో నైతిక విలువలు మరియు మానవ గౌరవ పరిరక్షణ వంటి అంశాలపై రాష్ట్రవ్యాప్తంగా చైతన్యం కల్పించబడుతుంది.

ఎస్ఐఓ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఆమిర్ ఫహెద్ మాట్లాడుతూ, నేటి యువత అల్గోరిథమ్లు, సోషల్ మీడియా మరియు కృత్రిమ మేధస్సు ప్రభావంలో పెరుగుతున్న తరమని అన్నారు. అవకాశాలతో పాటు తప్పుడు సమాచారం, సైబర్ వేధింపులు, అసభ్య కంటెంట్, ఆన్లైన్ లైంగిక దోపిడీ, ద్వేషపూరిత ప్రచారం మరియు బాధ్యతారహిత డిజిటల్ వినియోగం వంటి సవాళు కూడా వేగంగా పెరుగుతున్నాయని పేర్కొన్నారు. యువత సత్యనిష్ఠ, విమర్శనాత్మక ఆలోచన, నైతిక నాయకత్వం మరియు బాధ్యతాయుతమైన డిజిటల్ పౌరసత్వాన్ని అలవరచుకొని సాంకేతికతను సమాజ నిర్మాణానికి వినియోగించాలని ఆయన పిలుపునిచ్చారు. జమాతే ఇస్లామీ హింద్,నంద్యాల బాధ్యులు అబ్దుల్ సమద్ గారు మాట్లాడుతూ, సాంకేతిక పరిజ్ఞానం ఎంత వేగంగా అభివృద్ధి చెందుతున్నా. దానికి సమానంగా నైతిక విలువలు, బాధ్యత మరియు వ్యక్తిత్వ వికాసం పెంపొందకపోతే సమాజం తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటుందని అన్నారు. విద్య అనేది కేవలం ఉపాధి సాధనకు మాత్రమే కాకుండా, బాధ్యతాయుతమైన పౌరులను తీర్చిదిద్దే సాధనంగా ఉండాలని ఆయన పేర్కొ పేర్కొన్నారు. ఎస్ ఐ ఓ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ హఫీజ్ మాట్లాడుతూ, ప్రపంచం ప్రస్తుతం కేవలం సాంకేతిక విప్లవాన్ని మాత్రమే కాకుండా నాగరికతలో ఒక గొప్ప పరివర్తనను చూస్తోందని అన్నారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో ( ఎన్ సి ఆర్ బి) క్రైమ్ ఇన్ ఇండియా 2024' నివేదిక ప్రకారం దేశంలో ఒక్క ఏడాదిలోనే 1,01,928 సైబర్ నేరాలు నమోదయ్యాయని తెలిపారు. అలాగే యునిసెఫ్ నిర్వహించిన 'డిస్రప్టింగ్ హార్' అధ్యయనం ప్రకారం, సర్వే చేసిన దేశాల్లో 12-17 సంవత్సరాల మధ్య వయస్సు గల ప్రతి ఐదుగురు పిల్లల్లో ఒకరు ఏడాది కాలంలో ఏదో ఒక రూపంలో ఆన్లైన్ లైంగిక వేధింపులు లేదా దోపిడికి గురైనట్లు వెల్లడైందని పేర్కొన్నారు. యునెస్కో రూపొందించిన కృత్రిమ మేధస్సు నైతిక మార్గదర్శకాలు మానవ హక్కులు, పారదర్శకత, జవాబుదారీతనం మరియు మానవ గౌరవాన్ని పరిరక్షించాలని సూచిస్తున్నాయని గుర్తు చేశారు. సాంకేతిక అభివృద్ధి మరియు నైతిక బాధ్యత మధ్య పెరుగుతున్న అంతరాన్ని తగ్గించి, యువతలో బాధ్యతాయుతమైన డిజిటల్ పౌరసత్వం, డిజిటల్ శ్రేయస్సు, మీడియా అవగాహన మరియు విలువల ఆధారిత నాయకత్వాన్ని పెంపొందించడమే ఈ ప్రచార కార్యక్రమం ప్రధాన లక్ష్యమని వివరించారు. నంద్యాల ఎస్ఐఓ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎఫ్ ఐ ఓ నంద్యాల స్థానిక బాధ్యులు అబ్దుల్లా, ఖాజా, ముహమ్మద్ మరియు అరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## జల్ సంచాయ్ - జల్ భాగిధారీలో వేగం పెంచాలి.

**☛జలధార - జలహారతి విజయంతో జిల్లాకు సీఎం ప్రశంసలు.**

**☛జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**




పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. జల్ సంచాయ్ -జల్ భాగిధారీ కార్యక్రమంలో చేపడుతున్న పనులను వేగవంతం చేయడంతో పాటు, జలధార--జలహారతి కార్యక్రమంలో సాధించిన విజయాన్ని కొనసాగించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. జలధార - జలహారతి పనులను సమయానికి పూర్తి చేసినందుకు జిల్లా పర్యటన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా యంత్రాంగాన్ని ప్రత్యేకంగా అభినందించినట్లు ఆమె తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అల్ట్రా హై డెన్సిటీ ప్లాంటేషన్, జల్ సంచాయ్జ-ల్ భాగిధారీ, జలధార -జలహారతి కార్యక్రమాల పురోగతిపై ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో భూగర్భ జలాల శాఖ అధికారి రఘురాం, డ్వామా పీడీ సూర్యనారాయణమూర్తి, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ కోఆర్డినేటర్ అంకిత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అల్ట్రా హై డెన్సిటీ ప్లాంటేషన్, జల్ సంచాయ్ - జల్ భాగిధారీ కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలను మరోసారి పరిశీలించి, నాణ్యమైన ఫోటోలను మాత్రమే అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ఎంపికైన 50 జిల్లాలకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఇందులో మొదటి బహుమతిగా రూ.2 కోట్లు, రెండో బహుమతిగా రూ.1 కోటి, మూడో బహుమతిగా రూ.50 లక్షలు, నాలుగో బహుమతిగా రూ.25 లక్షలు అందజేస్తారని పేర్కొన్నారు. జలధార - జలహారతి కార్యక్రమంలో జిల్లాకు మొత్తం 2,031 పనులు మంజూరు కాగా, వాటిలో 1,960 పనులు నిర్దేశిత గడువులో పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన 71 పనులను ఆత్మకూరు, బండి ఆత్మకూరు, ఆళ్లగడ్డ మండలాల్లో అత్యంత వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల ద్వారా గతంతో పోలిస్తే భూగర్భ జలాల నిల్వ సామర్థ్యం ఎంత మేర పెరిగింది, నీటి రీచార్జ్ సామర్థ్యంలో ఎలాంటి మార్పు వచ్చింది అనే అంశాలను కూడా శాస్త్రీయంగా పరిశీలిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ వివరాలు భవిష్యత్ నీటి వనరుల ప్రణాళికకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అదేవిధంగా వీబీ రామ్‌జీ పనులకు సంబంధించి ఈ నెలకు రూ.8.40 లక్షల లక్ష్యాన్ని నిర్దేశించినట్లు తెలిపారు. లక్ష్య సాధన కోసం అధిక సంఖ్యలో ఉపాధి శ్రామికులు పనులకు హాజరయ్యేలా గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.



## నంద్యాలలో దివ్యాంగులకు ఉచిత హీరో మోటార్ సైకిళ్ల పంపిణీ

నంద్యాల జిల్లా బ్యూరో. : నంద్యాల మంత్రి క్యాంప్ కార్యాలయంలో దివ్యాంగుల లబ్ధిదారులకు మంత్రి ఎన్ఎండీ ఫరూక్, టీడీపీ రాష్ట్ర యువ నాయకుడు ఎన్ఎండీ ఫయాజ్ ఉచిత హీరో మోటార్ సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం, స్వావలంబనకు ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు.

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com